

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూలై 26, 2015

సౌర రథాలు

సొగసరి రాజశ్రీ



రాజీవ్ హరి ఓం భాటియా అనేది అక్కీ అసలు పేరు. ఇలాంటివి చాలా విషయాలే తెలియనివి ఉన్నాయి యాక్షన్ హీరో అక్షయ్ కుమార్ గురించి. సీ గ్రేడ్ సినిమాల నుంచి బాలీవుడ్ స్టార్ హీరోగా ఎదిగిన ఆయనకు గాడ్‌ఫాదర్‌లు ఎవరూ లేరు. మార్షల్ ఆర్ట్స్‌కు అంకితమైన అక్షయ్ సినీ రంగప్రవేశం నాటకీయంగానే ఉంటుంది. 25 ఏళ్ల నటజీవితాన్ని పూర్తిచేసుకున్న అక్కీ కెరీర్, ఫ్యామిలీ సంగతులు కొన్ని...

ఆ నవ్వుతో అన్నీ మాయం

- థాయ్‌లాండ్ సంప్రదాయ యుద్ధ కళ మువాయ్ థాయ్ నేర్చుకోవడానికి వెళ్లినపుడు ఖర్చుల కోసం చెఫ్‌గా పనిచేశాడు.
- తైక్వాండో, కిక్ బాక్సింగ్, కరాటే ఇలా చాలా మార్షల్ ఆర్ట్స్‌లో ఆరితేరిన అక్షయ్ ముంబైలో వాటిని బోధించేవాడు.
- తన శిష్యుల్లో ఒకరైన ఓ మోడలింగ్ ఫొటోగ్రాఫర్ అక్కీని మోడలింగ్‌లో ప్రవేశించమని సూచించాడు.
- మంచి డ్యాన్సర్ అయిన అక్కీ సినిమాల్లో బ్యాక్‌గ్రౌండ్ డ్యాన్సర్‌గా చేసేవాడు.
- ఓ సారి ఫ్లైట్ క్యాన్సిల్ కావడంతో బెంగళూరులో చేయాల్సిన ఓ పెద్ద యాడ్ షూటింగ్‌ను మిస్సయ్యాడు. ఆ సందర్భంలో ఏం చేయాలో తోచక ఓ ఫిల్మ్ స్టూడియోకు తన పోర్ట్‌ఫోలియో పట్టుకుని వెళ్లాడు.
- అప్పుడే ప్రొడ్యూసర్ ప్రమోద్ చక్రవర్తి కళ్లల్లోపడి కరిష్మా కపూర్ జంటగా 'దీదార్' సినిమా ఆఫర్ కైవసం చేసుకున్నాడు.
- ఆ తర్వాత ఎన్నో ఎత్తుపల్లాలను చూసిన అక్షయ్ సీ గ్రేడ్, బీ గ్రేడ్ సినిమాల్లోను నటించాడు.
- వీటిని ఏ మాత్రం తక్కువ చూడకూడదని, తక్కువ బడ్జెట్‌లో ఎంతో వైవిధ్యమైన ఐడియాలతో పనిచేస్తారని కితాబిచ్చాడు.
- 14 వరుస ఫ్లాప్‌ల తర్వాత 16 వరుస విజయాలను ఖాతాలో వేసుకుంది అక్కీనే.
- ఓటమి నుంచి బయటపడగలగడానికి మార్షల్ ఆర్ట్స్‌లో బోధించే ఫిలాసఫీనే కారణమని చెబుతాడు.
- క్రమశిక్షణ, కఠోర శ్రమే విజయ రహస్యాలని అంటాడు. తోటి వారితో అనవసర పోటీ, అసూయలకు దూరమంటాడు.
- తోటివారిని మోసగించకపోవడం, కెరీర్‌లు దెబ్బతినేలా ఎత్తులు వేయకపోవడమే తన ఎదుగుదలకు కారణమంటాడు.
- కెరీర్ ఆరంభంలో నటనకు సంబంధించిన ఓ పుస్తకాన్ని ఓ బుక్ స్టోర్‌లో చూశాడని, దాన్ని కొనేందుకు డబ్బు లేక పైపైన దాన్ని తిరగేస్తే అందులోని ఓ కోట్ ఆకట్టుకుందని చెప్తాడు.
- 'నటనంటే మరేం కాదు. గొప్ప మనిషిగా ఉండటమే' అనే ఆ లైన్‌ను ఎప్పటికీ ఫాలో అవుతానంటాడు.
- కుటుంబం కన్నా ఆరోగ్యానికే ప్రాధాన్యతనిస్తానని, అప్పుడే కుటుంబానికి సరైన న్యాయం చేయగలమని వివరించాడు.
- ట్వింకిల్ ఖన్నాతో వివాహమై 14 ఏళ్లు గడుస్తున్నా వారి మధ్య విభేదాలు రాకపోవడానికి కారణం ఆమేనని ప్రశంసిస్తాడు.
- ఆమె సెన్సాఫ్ హ్యూమరే వారి బంధానికి ఆధారమని, బరువైన విషయాల్ని కూడా నవ్వుతూ పరిష్కరించేస్తుందని తెలిపాడు.
- తమ పిల్లలు ఆరవ్, నిటారాలు స్టార్ కిడ్స్‌లా కాక సాధారణ జీవితం అనుభూతి చెందుతూ పెరగడమే ఇష్టమని చెప్పాడు.
- తన ఆహార్యం విషయాలన్ని భార్యే చూసుకుంటుందని, కేవలం మూడు క్షణాల్లో ఏ డ్రెస్సు వేసుకోవాలో తేల్చేస్తుందట.
- తన సోదరి అల్కానే తన సినిమాలకు అసలైన విమర్శకురాలని అంటాడు.
- జీవితంలో కొన్ని చిన్న తప్పులు చేశానని ఒప్పుకున్న అక్షయ్ వాటి వల్ల ఎదురు దెబ్బలు తప్పవని అనుభవపూర్వకంగా తెలిపాడు.
- ముంబైలో ఓ ఆటోలో ప్రయాణిస్తుండగా మీటర్‌కు ఉన్న రాడ్‌ను లాగితే అది 28 బదులు 8ను చూపించిందని, అదే ట్రిక్కును మరోసారి ప్రయోగిస్తే 40కి బదులు 140 కనిపించి నష్టపోయేలా చేసిందట. మంచి గుణపాఠాన్ని నేర్చుకున్నాడని అంగీకరించాడు.

ట్వింకిల్ ఖన్నా

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

రాతి గుండెలు

మనిషికి గుండె ప్రధానం. ఆ గుండెకు స్పందన కీలకం. లబ్‌డబ్‌మని కొట్టుకుంటూ తన ఉనికిని చాటుకుంటూ వుంటుందా చిట్టి గుండె. అంత ముఖ్యమైన స్పందనను గుండె కోల్పోతే! ఆ మనిషికి ప్రాణం లేనట్టే. ఇది సైన్స్ చెప్పే పాఠం.

⁂ ⁂ ⁂

మన కంటికి ఎదురుగా జరిగే ఘటనలకు గుండె స్పందిస్తుంటుంది. పరాయివారికి దెబ్బ తగిలినా చూసి ఓర్చుకోలేదు. తనకే తాకినట్టు విలవిల్లాడిపోతుంది. చేతనైన సాయం చేసి కాపాడాలని తపనపడుతుంది. గుండెకు అలాంటి స్పందన కరవైతే...ఎదురుగా ఎంత దారుణం జరుగుతున్నా ... పట్టనట్టు ఉదాసీనంగా వుండిపోతే! ఆ మనిషి గుండె రాయిగా మారిందని అర్థం. ఇది సోషల్ సైన్స్ నేర్పే పాఠం.

⁂ ⁂ ⁂

మనలో ఇలాంటి రాతి గుండెలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోనే కాదు. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి రాజధానిలోనూ వున్నాయి. అమాయకురాలైన మీనాక్షిని ఇద్దరు సైకోలు కత్తితో పొడవడం జనం చూస్తూనే వున్నారు. ఆమె బాధతో అరుస్తూనే వుంది. వేటగాడి బారిన పడిన జింకలా ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగెడుతూనే వుంది. అయినా జనంలో పెద్దగా స్పందన లేదు. ఒకరిద్దరిలో కొద్దిగా చలనం కనిపించినా సైకోలు కత్తితో బెదిరించడంతో జింకను క్రూరమృగానికి అప్పగించినట్టు ఆమెను వారికి విడిచిపెట్టేశారు. హారర్ సినిమా చూస్తున్నట్టు నిలబడిపోయారు. ఆమె గాయాలతో నిస్సహాయంగా నడిరోడ్డు మీదే ప్రాణాలు కోల్పోయింది. ఇహ తెలుగమ్మాయి ప్రత్యూషది మరో గాథ. ఆ లేత శరీరం మీద గాయం లేని అంగుళం లేదు. వాతలు లేని అవయవం లేదు. కాలిన మచ్చలు లేని అంగం లేదు. ఒళ్లంతా గాయాల మయం. కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నతండ్రి, మారు తల్లే ఆమె పాలిట కాల యముళ్లయ్యారు. వారు పెట్టే చిత్రహింసలకు తట్టుకోలేక పెద్దగా అరుస్తున్నా... ఏడుస్తున్నా... ఇరుగు పొరుగులో స్పందనే లేదట. ఆమెను కాపాడ్డానికి ఏమాత్రం ప్రయత్నించలేదట. ఒంట్లో ఓపిక వున్నా లేకున్నా ఆ బాధలు తట్టుకోలేక మైలు దూరం వినిపించేంతగా అరిచేదాన్నని ఆ పాప తర్వాత ఆస్పత్రిలో చెప్పినప్పుడు వెలుగులోకిచ్చిన చేదు వాస్తవమది. పొరుగింటి పసిపాప అర్ధరాత్రుళ్లు లేచి పాలకేడుస్తుంటేనే ఇరుగుపొరుగుకు మెలకువ వచ్చేస్తుంది. అలాంటిది కన్నవారు క్రూరంగా హింసిస్తుంటే ప్రత్యూష పెట్టే కేకలు పక్కవారికి వినిపించలేదంటే ఏమనుకోవాలి? ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, రక్తమోడుతున్న గాయాలను అదిమి పట్టుకొని పరుగెడుతున్న అమ్మాయిని చూసిన వారికి గుండె ద్రవించలేదంటే ఏమనుకోవాలి? గుండె బండవారిందంటే...బండ రాయే సిగ్గుతో తల దించుకొంటుందేమో! ఆ బాధితల స్థానంలో మనమే వుంటే? మనకు ప్రాణంలో ప్రాణమైన వారే వుంటే? అలాగే పట్టీపట్టనట్టు చూసీ చూడనట్టు శిలల్లా వుండిపోతామా! మన ప్రాణాలు ఒడ్డయినా సరే వారిని కాపాడుకోమూ! విలవిల్లాడిపోతున్న ఆడపిల్లల్ని ఆ నరకం నుంచి బైట పడేయమూ! అందుకే రాతి గుండెలకు చలనం నేర్పుదాం. స్పందన అలవరుద్దాం. జాలి అద్ది కష్టాల్లో వున్నవారిని ఆదుకునేలా చూద్దాం. అప్పుడే మనం మనుషులమన్న మాటకు అర్థం పరమార్థం వుంటుంది. లేకుంటే బండలకు మనకూ తేడా లేనట్టే. ■

◆ మనలో మాట



టపా

డిజిటల్‌మయం

డిజిటల్ గ్రామం చాలా ఆసక్తిగా ఉంది. మన గ్రామాలు ఎలా ఉండాలో తెలియజేస్తుంది. సమయం ఎలా ఆదా చేయాలో చెబుతుంది. ఆన్‌లైన్ సేవలు ఎలా పొందవచ్చో కూడా విపులంగా తెలియజేస్తూ వివరించారు. మన పిల్లల భవిష్యత్తు కోసం సులభతరంగా సేవలు అందుతాయని అనిపిస్తోంది.

డి. దేవ ప్రియం, జంగారెడ్డి గూడెం, ప.గో.జిల్లా

ఇట్టే తెలుసుకోవచ్చు

గుహలో అడవి చాలా బాగుంది. ఒక చోట నుంచి మరో చోటకు రవాణా సౌకర్యం తక్కువ కాబట్టి ఒక ప్రాంతం గురించే విష యాలు తెలిసేవి. ఇప్పుడు శాటిలైట్ టెక్నా లజీ పెరిగింది. ఏ ప్రాంతం గురించి అయిన నిమిషాల్లో తెలుసుకోవచ్చు. సోగ్గాడు శోభన్ బాబు గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యే కించి చెప్పవలసిన అవ సరం లేదు. నివాసా నికి ఏ వస్తువైనా మంచి దే. ఎండకి వానకి వెరకుండా ఉంటే చాలు. పెట్టుబడిని దృష్టి లో ఉంచుకుని నిర్మించు కోవచ్చు. సీసాల ఆఫీసు బాగుంది. ఆడదానిగా పుట్టడం కంటే అడవిలో మానై పుట్టడం మంచిదం టారు మన పెద్దలు. ఏ పాపం తెలియని పాపకు తన తండ్రి రేపిస్టు అని చెపుతానం టున్న భాదితురాలి గుండె ధైర్యం మెచ్చుకోద గినది. ఆ తల్లీబిడ్డలకు న్యాయం చేయాలి.

గంగాధర్, కడప

వింతైన లోకం

కాలేజీ అంటే కూర్చోబెట్టి పాఠాలు చెప్పడమే మనకు తెలిసింది. ఎవరికి ఎక్కువ మార్కులు వస్తే వారే తెలివైన వాళ్లని అనుకుంటాం. పనితో పాటు బాధ్యతను నెరవేర్చిన వాడే అసలైన విజ్ఞుడు. విభిన్నం బాగుంది. ప్రపంచం లోని అన్నీ దేశాలను చూడడం అంటే సామాన్యమైన విషయం కాదు. ఎంతో వ్యయంతో కూడుకున్న వ్యవహారం. అలాం టిది ఓ పత్రిక సంపాదకుడు అన్ని దేశాలను తిరిగి రావడం ఆనంద దాయ కం. అతని అనుభవాలను ఒక పుస్తక రూపంలోకి తీసుకురావడం ఆనందించ దగ్గ విషయం.

శ్యామ్, పులివెందుల

జన గోదావరి

ఆంధ్రాకు అను నిత్యం తిండిపెడుతున్న తల్లి గోదావరి. సాహిత్యానికి, రాజకీయ నేతలకు, ప్రకృతి అందాలకు, కళలకు నిలయం గోదావరి.మూడు గుర్రాలు, మూడు అయిదులు కథలో అఘాయి త్యాలకు పాల్పడిన మహేశ్‌కి ధనమ్మ మంచి బుద్ధి చెప్పింది. చెడ్డ బుద్ధి గల వాడికి ఇదొక గుణపాఠం.

రాము, కడప (మెయిల్)

శాంతి గీతాలు

పాముకు పాలు పోస్తే విషం కక్కుతుందనేది జగమెరిగిన సత్యం. ఒకసారి తుపాకీ పేలిందంటే అందులోంచి మరణ మృదంగం మోగినట్టే. అలాంటిది తుపాకీ నుంచి సంగీతం రావడం అనేది నమ్మలేకపోతున్నాను. మనిషి తలుచు కుంటే ఏదైనా సాధ్యమని చెప్పడానికి ఇదొక ఉదాహరణ. రీ సైకిల్డ్ కళ చాలా బాగుంది. మనదేశంలో పనికి రాని వస్తువులను రీ సైక్లింగ్ చేస్తే అద్భుత కళా ఖండాలు వెలువడుతాయేమో. శ్రీలంక ఒక అందమైన నగరం. తేయాకు తోటల తో, ప్యాలెస్‌లను పోలిన రాజ కట్టడాలతో బ్రిటిష్ కాలనీల వారసత్వానికి సింబాలి క్‌గా కనిపిస్తుంది.

వెంకట్, విశాఖపట్నం.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజామాబాద్, హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

సౌర రథాలు

కవర్ స్టోరీ 14

మనిషి పక్షిని చూశాడు. రెక్కలు కట్టుకుని ఎగరాలనుకున్నాడు. మనిషి చేపను చూశాడు. మొప్పల్ని తొడిగి సముద్రం అడుగుకు చేరాలని కలలు కన్నాడు. మనిషి చెట్టునూ చూశాడు. సూర్యుడి నుంచి శక్తిని గ్రహించి కాయనో పండునో పొందాలనుకున్నాడు. రెక్కలు లేకపోతేనేం విమానాలు దాటి రాకెట్లనెక్కి చందమామను పలకరించాడు. మొప్పలు తొడగకపోతేనేం స్కూబా డైవ్‌లు దాటి జలాంతర్గాముల్లో యేళ్లకు యేళ్లు గడిపేస్తున్నాడు. కాంతిని విద్యుత్ శక్తికి మళ్లించి గెలిచాడు. సౌర విద్యుత్ శక్తి ఇపుడు కాయే కావొచ్చు.. అదే పండై భవిష్యత్తును పండించబోతోంది. వాహన ఇంధన అవసరాలకు ఫలం కాబోతోంది. భవిష్యత్తు ప్రయాణానికి ఇంజిన్ స్టార్ట్ చేశాయి సౌర రథాలు.



స్ఫూర్తి 3
వికలాంగులకు వివాహం చేస్తుంది !

నవ్వుల్ పువ్వుల్ 4

యూత్ 5
దిల్లున్న ఆటోవాలా

సినిమా కబుర్లు 6
సొగసరి రాజశ్రీ

వింత లోకం 8
అల్పకా సాక్షిగా

ఆదర్శం 9
తేనీటి రచయిత

చుద్దామా 10
సంబరాల స్పెయిన్

ప్రత్యేకం 11
రోటీ బ్యాంకు

కథ 18
ప్రేమ పొత్తిళ్లలోకి

రుచి 21
ఓట్స్ టిక్కీ

బాలనేస్తాలు 22
భలే టూత్ బ్రష్ !

కొత్త పుస్తకాలు 24
స్త్రీ పర్వం

స్వరస్మరామి -12

వికలాంగులకు వివాహం చేస్తుంది

ఆమె మధ్య వయస్కురాలేం కాదు. ఇంటింటికి తిరిగి పెళ్లిళ్లు కుదర్చడానికి. తనకు కేవలం 22 సంవత్సరాలే. ఓ ప్రత్యేక లక్ష్యంతో వయసుకు మించిన బాధ్యతను భుజాన వేసుకుంది. ఎవ్వరూ అంతగా పట్టించుకోని విభిన్న ప్రతిభావంతులకు సరైన జోడీ చూసి పెట్టాలని నిర్ణయించుకుంది. అందుకోసం ఒక వివాహ వేదికను, ఓ యాప్ ప్రారంభించింది. వికలాంగులకోసం తాను సైతం చేస్తున్న అరుదైన ప్రయత్నంగురించి తెలుసుకుందాం.

స్ఫూర్తి

పెళ్లనగానే రూపానికే ప్రథమ ప్రాధాన్యత ఎక్కడైనా. రుచులు, అభిరుచులు, అభిప్రాయాలు వగైరాలన్నీ ఆ తర్వాతే. శారీరకంగా ఏ కొంచెం లోపం వున్నా వారికి పెళ్లి అన్నది కలగానే మిగిలిపోయే రోజులివి. వారికోసం ఏదో ఒకటి చేయాలన్న తపన కళ్యాణి కోహనాలో కలిగింది. అప్పుడామెకు సరిగ్గా 21 సంవత్సరాలు. ముంబైలోని హెచ్.ఆర్. కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనామిక్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. అందరూ ఉద్యోగాల నిమిత్తమో, పై చదువులకోసమో ప్రయత్నాలు చేస్తుండగా కళ్యాణి మాత్రం అందుకు భిన్నంగా ఆలోచించింది. ముంబైలో వ్యాపార కుటుంబంలో పుట్టిన ఆమె చదువంతా అక్కడే పూర్తి చేసినా... ప్రస్తుతం ఢిల్లీలోనే నివాసం. బాల్యం నుంచీ ఉన్నత భావాలు కలిగిన కళ్యాణి సామాజిక స్పృహతో వికలాంగులకోసం 'వాంటెడ్ అంబరిల్లా' అనే మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్‌ను, 'లవబిలిటీ' అనే యాప్‌నూ రూపొందించింది. వివాహం చేసుకోదలిచిన వికలాంగులు ముందుగా అందులో సభ్యత్వం తీసుకోవాలి.

పరిశీలన తర్వాతే...

20 నగరాలకు చెందిన వారు వాంటెడ్ అంబరిల్లాలో సభ్యులుగా వున్నారు. గూగుల్, ఫేస్‌బుక్ అకౌంట్ల ద్వారా లవబిలిటీ యాప్‌ను ఉపయోగించవచ్చు. అయితే యాప్‌లోనైనా, అంబరిల్లాలోనైనా సభ్యత్వం తీసుకునేటప్పుడే వారి వివరాలను పూర్తిగా ఆరా తీస్తారు. ఆ తర్వాతే వారి ప్రొఫైల్‌ను కళ్యాణి బృందం రూపొందిస్తుంది. దీనితోపాటే ప్రతి ఒక్కరి ఇంటర్వ్యూ చేస్తుంది. వారి అభిరుచులు, ఆరోగ్య పరిస్థితులు పరిశీలించాక ఎవరికి ఎవరైతే జంట బాగుంటుందో కూడా అంచనా వేస్తుంది. ఆ తర్వాతే వారిని వివాహ వేదిక ద్వారా కలిపే ప్రయత్నం చేస్తుంది. అన్నీ అనుకూలంగా వున్నాయనుకున్నప్పుడు వారిని వ్యక్తిగతంగా కలుసుకునే ఏర్పాట్లు చేస్తుంది. అయితే ఇవేవీ ఉచిత సేవలు అందించే సంస్థలు కాదు. ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకుంటారు. స్తోమతును బట్టి కూడా ఫీజులో హెచ్చుతగ్గులుంటాయి.

యాప్‌తో మరింత చేరువ

ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మన దేశంలోని వికాంగుల్లో కేవలం ఐదు శాతం మాత్రమే వివాహం చేసుకొన్నారు. ఈ చేదు నిజం చదివిన కళ్యాణి నిర్ఘాంత పోయింది. వారి కోసం ఇంకా ఏదో ఒకటి చేయాలనిపించింది. మొబైల్ యాప్ ఆలోచన అప్పుడే వచ్చిందామెకు. దీని ద్వారా అంతర్జాతీయంగా వున్న 200 మిలియన్ల మంది వికలాంగులను చేరుతుందా సందేశం. అలా ప్రారంభమైందే 'లవబులిటీ' యాప్. యాప్ నిర్వాహక బృందం ముందుగా పెళ్లి చేసుకోవాలనుకున్న వారి ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తారు. వారికి ఎంత శాతం వైకల్యం వుంది? ఏ మందులు వాడతారు? ఎంత మేరకు ఇతరుల మీద ఆధారపడతారు? తమకు సాయంగా ఎలాంటి పరికరాలను వాడతారు? ఎంత మేరకు జబ్బు నయమయ్యే అవకాశం వుంది? వంటి వివరాలకు ప్రాధాన్యత నిస్తారు. వారి అందం గురించిన వివరాల సేకరణకు ద్వితీయ ప్రాధాన్యత వుంటుంది. కంటి చూపు సమస్య వున్నవారికి సైతం ఈ యాప్ సాయం చేస్తుంది. మాట వినిపించేలా వీరి కోసం ప్రత్యేక ఏర్పాటు చేశారు. 'లవబిలిటీ కేవలం ఒక యాప్ మాత్రమే కాదు. విభిన్న ప్రతిభావంతులకు సాయంగా వుండేందుకు దీన్ని రూపొందించాం. తమకు సరిగ్గా సరిపోయే జీవిత భాగస్వామిని ఎంచుకునేందుకు, ఏకాభిప్రాయాలు కల వారితో పరిచయం పెంచుకునేందుకు ఇది చక్కగా ఉపయోగపడుతుంది' అంటుంది కళ్యాణి ఆశావహంగా. భవిష్యత్తులో వితంతు వివాహ వేదికనుకూడా ఏర్పాటు చేయాలన్నది ఆమె ఆలోచన.

నవ్వుల్ – పువ్వుల్

రిప్లై లెటరు

రచయిత గురవారావు కొడుకు వీరేశం కూతురికి ప్రేమ లేఖ రాశాడు. అది చదివిన వీరేశం కోపంగా గురువారావు దగ్గరకు బయల్దేరాడు.

"**చూ**శారా మీ అబ్బాయి ఏం చేశాడో?

మా అమ్మాయికి లవ్ లెటర్ రాశాడు చెప్పాడు వీరేశం కోపంగా.

"**రి**ప్లై కవర్ పెట్టాడా?" అడిగాడు రచయిత గురవారావు.

పొదుపరి

భార్య: చీర కొనుక్కుంటాను, వెయ్యి రూపాయలిమ్మంటే ఇవ్వరేం. పెళ్లికి ముందు డబ్బుని నీళ్లలా ఖర్చు పెడతానని కోతలు కోశారు. నిలదీసింది భర్తని.

భర్త: ఓసి పిచ్చిదానా నీకింకా తెలియదేమో.. నేను నీళ్లని కూడా చాలా పొదుపుగా వాడతాను.

మందు

రామారావు ప్రతిరోజు బార్‌కెళ్ళి మందు తాగుతాడు . ప్రతిరోజు రెండు గ్లాసులు ఆర్డర్ ఇచ్చి పక్క పక్కనే పెట్టుకుని ఒక సిప్పు ఒక గ్లాసులోంచి, మరీ సిప్పు చేసి రెండో గ్లాసులోంచి తాగుతాడు ఈ తతంగం అంతా చాలా రోజులు నుంచి చూసిని సర్వర్ ఆనందం ఒక రోజున రామారావుని అడిగేశాడు.

నేను ఎప్పుడు మందు నా స్నేహితుడి సుబ్బారావుతో కలిసి తాగేవాడిని. వాడు ప్రమాదవ శాత్తు చనిపోయాడు. అతని జ్ఞాపకార్థం రెండు గ్లాసులు తాగుతున్నాను.

కొంత కాలం తరువాత రోజు ఒక గ్లాసు మాత్రమే ఆర్డరు చెయ్యడం మొదలు పెట్టాడు రామారావు. ఈ విషయం గమనించిన సర్వర్ రామారావుని అడిగాడు ఏంటి సార్ మీ స్నేహితుడిని పూర్తిగా మర్చిపోయారా?

'**లే**దయ్యా నేను మందు మానేశాను'. చెప్పాడు రామారావు.

ప్రేమ

రాత్రిపూట ఎంత లేటుగా వెళ్ళినా మా ఆవిడ ఏమీ అనదు. పైగా వెళ్ళగానే వేడి వేడి కాఫీ ఇస్తుంది. స్నానానికి వేడి నీళ్ళు తోడి పెడ్తుంది. చెబుతున్నాడు చింతామణి

అబ్బా మీ ఆవిడకు నీ మీద చాలా ప్రేమన్న మాట నోరు తెరుస్తూ అన్నాడు భూషణం.

మరి అంత చలిలో అంట్లు తోమడం కష్టం కదా. అసలు విషయం చెప్పాడు చింతామణి.

మీరు కనిపెట్టారా?

ఒక రైల్లో జనరల్ కంపార్ట్‌మెంట్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది.

'కిళ్లీ ఉమ్మడానికి కూడా కదిలే వీల్లేకుండా వుంది' మొహం వెనక్కి తిప్పి తన వెనక నిల్చున్న ప్రయాణికుడితో అన్నాడు గోవిందు.

'**మీ** ముందున్న వాడి వెనక జేబులో ఊసేయండి' మెల్లగా సలహా ఇచ్చాడాయన.

'**ఆ**యనికి తెలిస్తే..' కిళ్లీ తుంపర్లు మీద పడకుండా అన్నాడు గోవిందు.

'తెలీదు. నేను ఊసింది మీకు తెలిసిందా?' అడిగాడు ప్రయాణికుడు.

జర్మనీ

టర్కీ వాళ్ళని టర్క్స్ అని పిలుస్తారు. మరి జర్మనీ వాళ్ళనూ అంటూ పాఠం చెబుతోంది టీచర్

నాకు తెలుసు టీచర్ చెప్పాడు బంటీ.

ఏమంటారు

జెర్మ్స్ జవాబిచ్చాడు బంటీ

ఆవు వ్యాసం

నాన్న: ఒరేయ్ ఆవు మీద కూర్చుని ఏం చేస్తున్నావురా?

కొడుకు: మాష్టారు ఆవు మీద వ్యాసం రాసుకురమ్మన్నారు. అందుకని!

దిల్లున్న ఆటోవాలా

ఈ ఆటోవాలా రూటే సపరేటు. అతడి ఆటో స్టయిలూ వేరేనే. అర లక్ష మంది ముంబై ఆటోడ్రైవర్లలో సందీప్ బచ్చే ఒకడే కానీ సేవా జీవితంతో వారందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆటోలోని సదుపాయాల నుంచి సేవ స్కీముల వరకు అంతా విభిన్నమే. బాలీవుడ్ తారలకే సెలబ్రెటీ ఫిగరయ్యాడు.

సందీప్ బచ్చే ఆటోలో కూర్చుంటే మంచి మూవీతో ప్రయాణం సాఫీగా సాగిపోతుంది. ఓ బుల్లి స్క్రీన్ ఆటోలో ఫిట్ చేశాడు. పొద్దునే ఆఫీసుకు పరుగులు పెట్టేవారు దినపత్రిక చదవడం మిస్సవ్వరు. ఆటోలో బిగించిన స్టాండ్‌లో నాలుగైదు దినపత్రికలు రెడీగా ఉంటాయి. గమ్యానికి చేరువైన సమాచారం తెలిపేందుకు సెల్‌ఫోన్ బ్యాలెన్స్ లేకపోయినా ఫర్లేదు. ఓ పే ఫోన్ చేతికి అందుబాటులోనే ఉంటుంది. మొబైల్ చార్జర్ కూడా ఉంది. ఫేస్‌బుక్, ఇంటర్‌నెట్‌తో కాలక్షేపం చేయడానికి వైఫై ఆటోలోనే ఉంటుంది. సందీప్‌కు టెక్నాలజీ అంటే పిచ్చి. ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో అకౌంట్ తెరిచి ఆటో బుక్ చేసుకునేలా నంబర్ ఇస్తాడు. బులియన్ మార్కెట్ రేట్లు ముఖానికి ఎదురుగ్గా రాసి ఉంటాయి. స్టాక్ ఎక్స్ఛేంజ్ సమాచారం, కరెన్సీ విలువలు, వాతావరణ సమాచారం ఇలా సకలం తెలుసుకోవచ్చు. వీటితోపాటు 'బీయింగ్ హ్యూమన్', 'సేవ్ గర్ల్ చైల్డ్', 'మెన్ అగనెస్ట్ రేప్' నినాదాలు రాసి ఉంటాయి. ప్రథమ చికిత్స ఏర్పాట్లు ఆటోలోనే చేసుకున్నాడు సందీప్ బచ్చే. మోసం లేకుండా మీటర్ వేసి ప్రతి మీటర్‌కు 2 చొప్పున లెక్కేసి తన సొమ్మును పేదలకు దానం చేస్తాడు కూడా. మున్నాభాయ్ ఎస్.ఎస్.సీగా తనకు తాను పిలుచుకునే సందీప్‌ది గొప్ప ఫిలాసఫీ. జనసంద్రమైన ముంబైలో ఒక్కొక్కరిది ఒక్కో స్వప్నం, ఒక్కో కష్టం. తనకంటే ఇబ్బందులు పడుతున్నవారు బోలెడుమంది. వారే నిబ్బరంగా, సంతోషంగా బతుకుండగా లేనిది తనెందుకు ఉండలేడనేది ప్రశ్న. చిన్న చిన్న మొత్తాలే జీవితాలైన వారి కోసం డబ్బును దానం చేసి సంతృప్తి చెందుతాడు. తన చేయగలిగనంత చేయడమే పాయింట్ అంటాడు సందీప్. రోగులు, గర్భిణులకు నుంచి కిరాయి డబ్బులు తీసుకోడు. వృద్ధులకు, పేదలకు, అంధులకు, మానసిక వైకల్యం ఉన్నవారికి తగ్గింపు ఉంటుంది. కొత్త జంటల తొలి ప్రయాణాలకు కిరాయి తగ్గించి కాలం పెంచుతాడు. ఓ వృద్ధాశ్రమానికి మందులను, అనాథాశ్రమానికి చాక్లెట్లు, బిస్కెట్లను వాయిదా లేకుండా ఇస్తుంటాడు. ప్రతి ఆదివారం ఇంటి ఇంటికి తిరిగి పాత బట్టలను, సామాన్లను సేకరించి సేవాశ్రమాలకు ఇస్తుంటాడు. ఖాళీ సమయం దొరికితే బాంద్రా వీధులను శుభ్రం చేస్తుంటాడు. హిజ్రాలతో చక్కని చెలిమి ఉంది. రెండు వారాలోసారి వారికి చాయ్ పార్టీ ఇస్టుంటాడు. 15 ఏళ్లుగా ఆటోను తోలుతున్న సందీప్ గురించి ముంబై అంతా పాకిపోయి సల్మాన్ ఖాన్, షాహిద్ కపూర్, అనురాగ్ కశ్యప్ లాంటి బాలీవుడ్ స్టార్లు అతడిని కలిసి ప్రశంసించి ఆటోలో ప్రయాణం చేశారు.

ప్రయాణ మలుపు..

ఇంత గుర్తింపు ఉన్న సందీప్ నిరాడంబరంగా గడుపుతాడు. తన కుటుంబంతో బాంద్రా-ఖర్‌లో ఒకే రూమ్ ఉన్న ఇంట్లో నివసిస్తున్నాడు. సందీప్ 1999 వరకు ఓ ట్రావెల్ ఏజెన్సీలో చేసేవాడు. అది మూతబడటం, తండ్రి రిటైరవడంతో ఆటోవాలా అయ్యాడు. సందీప్ తల్లి క్యాన్సర్‌తో మరణించింది. ఎంతమంది నేతల చుట్టూ తిరిగినా ఎవరూ ఆదుకోలేదు. కొన్నాళ్లపాటు ఆ బాధలోనే ఉన్న సందీప్ ఓ రోజు ఆటో నడుపుతుండగా బాంద్రాలోని ఓ నిర్మాణ పనుల దగ్గర ఓ రాజస్థానీ మహిళ తన ఇద్దరు చంటిపిల్లలతో రోడ్డు పక్కన ఏడుస్తూ కనిపించింది. పరుగుల ముంబై ఆ మహిళను గుర్తించలా. ఎవరి పనుల్లో వారు పరిగెడుతున్నారు. సందీప్ ఆ మహిళ దగ్గరకు వెళ్లి విషయం కనుక్కున్నాడు. భిక్షాటన చేస్తూ బతికే ఆమె భర్త తాగుబోతు. ఆమె దగ్గరున్న డబ్బును లాక్కుని మద్యం షాపుకు వెళ్లాడు. ఆకలితో పిల్లలు ఏడుస్తున్నారని ఆమె వివరించింది. ఆమెకు చిన్న మొత్తం డబ్బును సందీప్ ఇవ్వగా వెంటనే బిస్కెట్ ప్యాకెట్ కొని పిల్లలకు తినిపించింది. బిడ్డల ఆకలి బాధ తగ్గిందన్న సంతోషంలో ఆమె రెండు చేతులూ ఎత్తి సందీప్‌కు నమస్కరించింది. తానిచ్చిన ఆ చిల్లర డబ్బు ఓ చిన్న ప్రాణం పొట్ట నింపిన విషయాన్ని అర్థం చేసుకున్న సందీప్ అప్పటి నుంచి కొద్ది మొత్తాన్ని అన్నార్తులకు ఇవ్వడం మొదలెట్టాడు. అలా తన సేవను పెంచుకుంటూ 11 ఏళ్లకు టీవీ, ఎఫ్.ఎం., రేడియో కార్యక్రమాలిస్తూ ఫేస్‌బుక్, ట్విట్టర్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నాడు. అతడి గురించి తెలుసుకున్న అభ్యుదయ సంఘాలు, సేవా సంస్థలు, క్లబ్‌లు ఉపన్యాసాలు ఇప్పిస్తున్నాయి. దిల్లున్నోడికి దునియా సలాం చేయదూ!

✦

సల్మాన్‌తో సందీప్...

సొగసరి రాజశ్రీ

యాభైల్లో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటి రాజశ్రీ. అందం అభినయం రెండూ కలగలసిన అరుదైన తార. ఎన్టీఆర్‌తో అభినయించినా, కాంతారావుతో జోడీ కట్టినా, పలువురు కథానాయకులతో ఆడిపాడినా అభిమానులను మెప్పించగలిగిన సత్తా ఆమె సొంతం. ఓ వైపు హీరోయిన్‌గా చేస్తూనే సెకండ్ హీరోయిన్‌గా చేయడానికి ఏమాత్రం వెనకాడని గుండెధైర్యం ఆమెది. గ్లామరస్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యత వున్న పాత్రలనూ సమానంగా చేసి మెప్పించిన అలనాటి సొగసరి రాజశ్రీ.

చెన్నై.టి.నగర్ పోరూరు సోమసుందరం వీధిలో మొదటి రెండు ఇళ్లూ రాజశ్రీకి చెందినవే. అప్పట్లో ఆ పక్కనే క్లారినేట్ పుల్లారావు. అలా కాస్త నాలుగడుగులు ముందుకు వేస్తే అదే వీధిలో వి.వి.గిరి గారబ్బాయి, చిరంజీవిగారిల్లు, రంగనాథ్, ఎదురుగా విజయ నిర్మల, రోడ్డుకి అభిముఖంగా శ్రీదేవి, మేడ మీద జి.వి.రామారావు, స్టిల్ ఫొటో గ్రాఫర్ భూషణ్ ఉండేవారు. ఆ రోజుల్లో ప్రతిరోజు నిత్య కళ్యాణం పచ్చతోరణంలా ఉండేది ఆ వీధి.

అప్పట్లో రాజశ్రీ గ్లామర్ తార. చాలా ధైర్యస్తురాలు. మనసులో మాట నిర్భయంగా చెప్పేవారు. తొలి చిత్రాలు భక్త అంబరీష్, మాంగళ్యం ద్వారా టాలెంట్ ఉన్న నటీమణిగా సినీ పరిశ్రమకి పరిచయమయ్యారు. తొలిరోజుల్లో కాంతారావు, రామకృష్ణల కాంబినేషన్‌లో నటించారు. జానపద వేషధారణలో కొట్టొచ్చేలా కనిపించేవారు. శైవా మాస్టారి దగ్గర నృత్యం నేర్చుకున్నందున ఎక్కువ నృత్య ప్రధాన పాత్రలకే ఆసక్తి చూపించేవారు. కానిస్టేబుల్ కూతురు, ఆరాధన, దక్షయజ్ఞం లాంటి చిత్రాల్లో ప్రధాన పాత్రలు పోషించినా విఠలాచార్య సినిమా 'గురువుని మించిన శిష్యుడు' సంచలన విజయం సాధించింది. విఠలాచార్యకి నటీనటులపైన ప్రేమాభిమానాలుండేవి. తండ్రిలా ఆదరించేవాడు. సినిమా ప్రపంచం గురించి మాట్లాడుతూ దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి అనేవారు. సినిమా ప్రపంచంలో తెర జీవితం మెరుపులా మెరిసి మాయమైపోయేది. ఆ మెరుపు శాశ్వతం అనుకోవడం అవివేకం! ఇండస్ట్రీలో ఎవరికీ ప్రేమాభిమానాలుండవు. అంతా నటన. మనమూ అలాగే ఉండాలి. అవి శాశ్వతంగా కొనసాగినప్పుడు మనం ఒక నిర్ణయానికి రావచ్చు. ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలి. ఇండస్ట్రీలో మాట పెదవి దాట కూడదు! వంటి ఎన్నో జాగ్రతలు చెప్పి రాజశ్రీకి వరుసగా విఠలాచార్య చిత్రాల్లో అవకాశాలిచ్చారు. విఠలా చార్య మాటలు తన జీవితంలో ఎంతో ప్రభావాన్ని చూపించాయంటారు రాజశ్రీ ఆత్మీయులతో.

కాంతారావుతో ఆకాశ రామన్న, పక్కలో బల్లెం, తోటలో పిల్ల – కోటలో రాణి లాంటి చిత్రాల్లో నటించినా, ఎన్.టి.ఆర్ చిత్రం ' అగ్గిపిడుగు' కమర్షియల్ హీరోయిన్‌గా నిలబెట్టింది. పిడుగు రాముడు, మహామంత్రి తిమ్మరసు, స్త్రీ జన్మ లాంటి చిత్రాల్లో ఎన్.టి.ఆర్‌తో కలిసి నటించారు. ఎన్టీఆర్‌తో నటించడం తన జీవితంలో గొప్ప అనుభవం అంటారు రాజశ్రీ. నాట్యం చేస్తున్న సమయంలో ఆమె పాదాలు వాచిపోయేవి. రాజశ్రీ బాధని దిగమింగి నవ్వుతూ షూటింగ్ పూర్తిచేసేవారు. షూటింగుకి హాజరయ్యే విషయంలో అందరి కంటే ముందుండేవారు, మేకప్‌తో సహా. తన జీవితంలో రాజశ్రీ వల్ల షెడ్యూలు ఆలస్యమైందని అనిపించుకున్న సినిమా ఒక్కటీ లేదు. ఎన్టీఆర్ తర్వాత అక్కినేనితో 'ప్రేమించి చూడు' సినిమాలో నటించారు. ఇది రాజశ్రీ జీవితంలో గొప్ప అనుభవం. తమిళంలో 'కాదలిక్కి నేరమిల్లై' చిత్రాన్ని తెలుగులో 'ప్రేమించి చూడు' చిత్రంగా తీశారు. తమిళంలో శివాజీ గణేశన్, తెలుగులో అక్కినేని నటించారు. తెలుగులో విజయవంతమైన చిత్రంగా పేరుతెచ్చుకుంది. అక్కినేనితో ఆత్మ గౌరవం, గోవుల గోపన్న చిత్రాల్లో నటించారు. నిజానికి అంత వరకు జానపద చిత్రాల్లో మహారాణుల వేషధారణలో మునిగి తేలిన రాజశ్రీ, ఫ్యామిలి ఎంటర్‌టైనర్స్‌లో నటించడానికి ఇబ్బంది పడ్డారు. ప్రేమించి చూడు చిత్రంలో అక్కినేని అందించిన సహకారం మరిచిపోలేనిదని ఆమె అంటారు. నటనలో మెళకువలు నేర్పిన అక్కినేని తన జీవితంలో మరచిపోలేని హీరోగా నిలిచిపోయారని అంటారు రాజశ్రీ.

నా మనసుకి బాగా దగ్గరైన హీరో శోభన్‌బాబు అని రాజశ్రీ చెబుతారు. బహుశా సమకాలీనులు, సమ వయస్కులు కాబట్టి వారి మధ్య అరమరికలుండేవి కావు.

మనసు విప్పి మాట్లాడుకునేవారు. లోగుట్టు పెరుమాళ్లకెరుక, కాంభోజరాజు కథ, మర్యాద రామన్న , రక్త సింధూరం సత్తెకాలపు సత్తెయ్య చిత్రాలు శోభన్‌బాబుతో చేశారు. కె.యస్.దాసుకది 'లోగుట్టు పెరుమాళ్ళు కెరుక' మొదటి చిత్రమైనా శోభన్‌బాబు రాజశ్రీల కాంబినేషన్ విజయవం తమైంది. తరువాత శోభన్‌బాబుతో వరుసగా ఆఫర్లు వచ్చాయి. పక్కవారితో ప్రేమగా మాట్లాడటం ఆయన్నుంచే నేర్చుకున్నానని ఆమె అంటారు. ఎదుటి వారిని గౌరవించడం, కలలో కూడా ఎదుటివారిని చులకనగా మాట్లాడకుండా వుండటం,పొరపాటున కూడా ఎవర్నీ తక్కువ చేసి మాట్లాడ్డం చూళ్లేదు. ఎప్పుడూ చిరునవ్వుతో ఉంటారు శోభన్‌బాబు అని పలు సందర్భాల్లో మనసులోని మాటను చెప్పారు రాజశ్రీ.

అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎం.ఎల్.సి. గా వున్న పాంచజన్యని వివాహం చేసుకున్న తర్వాత సినిమా పరిశ్రమకి గుడ్‌బై చెప్పేసిందామె. ఎంత మంది నటించమంటూ కోరినా నటించలేదు. వారి కొడుకు నాలుగేళ్ల వయసులో వుండగా భర్త మరణించాడు. భర్త మరణం తర్వాత విశాఖపట్నంలోనే కాలక్షేపం చేసింది. నిరాడంబ రమైన జీవితం గడిపింది. శారద, వాణిశ్రీ, సచూ, జయప్రద, పద్మిని ఏదో ఒక రూపంలో కలిసేవారు. వారి స్నేహం గొప్పది. 2004లో రాజశ్రీకి మహానటుడు యం.జి.ఆర్ అవార్డు వచ్చిందని తొలుత ఫోన్ చేసి చెప్పింది ఆమెకు సచ్చునే.

తెలుగు పరిశ్రమ వజ్రోత్సవాలకు రాజశ్రీకి ఆహ్వానం రాకపోవడం తీరని బాధ కలిగించింది. తెలుగు సినిమా స్వర్ణయుగసారథులు వీరంతా. తెలుగు, తమిళ, మలయాళం, హిందీ భాషల్లో కలిసి రెండు వందల పైచిలుకు చిత్రాల్లో రాజశ్రీ నటించారు. వీరిని మరిచిపోవడం బాధాకరం. జీవితంలో ఊహించని దానికంటే ఎక్కువ సాధించగలిగానన్న తృప్తి ఆమెకుంది. మహానుభావులు ఎన్టీఆర్, నాగేశ్వరరావు, జగ్గయ్య, కాంతారావు, శోభన్‌బాబు, రామకృష్ణ, హరినాథ్‌లాంటి మహానటులతో కలిసి నటించింది.

అవార్డులూ రివార్డుల మాట అటుంచితే సినిమా మీద తపనతో వచ్చారామె. చేసిన ప్రతి సినిమా దీక్షగా చేశారు. ఎన్నో బాధల్ని భరించినా గానీ ఏ రోజు వ్యక్తం చేసేది కాదు. తన ఆరోగ్యం బాగోలేదని ఒక్క రోజు షూటింగుకి గ్యాప్ ఇచ్చిన సందర్భం జీవితంలో ఇంత వరకు రాలేదంటారు. అదే రాజశ్రీ గొప్పతనం.

-ఇమంది రామారావు,

9010133844

వెయ్యేళ్లనాటి బొమ్మల నుంచి ఇప్పటి బార్బీ బొమ్మలు కొలువైన పెద్ద మ్యూజియం చెక్ రిపబ్లిక్‌లోని ప్రాగ్‌లో ఉంది. కేవలం పిల్లలే కాదు అమ్మమ్మలు, తాతయ్యలు కూడా ఇక్కడ సందడి చేస్తారు. పెద్దల్ని సైతం టికెట్ల కోసం క్యూలో నిలబెట్టే ఈ మ్యూజియం మొదలైంది ఓ చిన్న గదిలో. రంగస్థల నాటకాలకు దర్శకత్వం వహించే యువాన్ షైగెర్ అనే వ్యక్తి సేకరించినవే ఈ బొమ్మలు. సినిమాలు కూడా తీసే యువాన్‌కు ఓ సారి మెటల్ కారు బొమ్మ అవసరమైంది. ఓ సినిమాలో దాన్ని ఉపయోగించాక అలాంటి బొమ్మల్ని సేకరించాలని ఉత్సాహం మొదలైంది. అలా కొన్ని వేల బొమ్మల్ని సేకరించి చిన్నారుల కోసం ప్రదర్శన ఏర్పాటు చేశాడు. వాటిని పిల్లలతో పాటు వచ్చి చూసిన పెద్దలు కూడా అభిమానులైపోయి ప్రత్యేకంగా వారే మ్యూజియానికి రావడం ఎక్కువైంది. అంత అద్భుతంగా ఉండే ఆ బొమ్మల మ్యూజియం గురించి..

బొమ్మల కొలువు

- బొమ్మలకు అపార్ట్‌మెంట్ స్థలం సరిపోక మ్యూనిచ్ అధికారులు టౌన్ హాల్‌ను ఇచ్చారు.
- ప్రాగ్‌లో మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలనుకున్న యువాన్ 3989లో అక్కడకు మార్చేశాడు.
- 2 వేల ఏళ్ల క్రితం తయారుచేసిన బొమ్మలను ఇక్కడ చూడొచ్చు.
- బీడ్స్, రాళ్లు, కలపతో చేసిన రెడ్ ఇండియన్ల బొమ్మలు కూడా ఉన్నాయి.
- దాదాపు అన్ని దేశాల బొమ్మలను యువాన్ సేకరించాడు.
- 11 ప్రదర్శన శాలలున్న ఈ మ్యూజియంలో బార్బీలకే ప్రత్యేక స్టోర్ ఉంది.
- 1959లో తొలిసారి తయారైన బార్బీ బొమ్మను కూడా ఇక్కడ చూడొచ్చు.
- రైళ్లు, నౌకలు, విమానాల వంటి పలు రకాల వాహనాల బొమ్మలూ ఉన్నాయి.
- ప్లాట్‌ఫారమ్, రైళ్లతో కూడిన పెద్ద రైల్వేస్టేషన్ మోడల్ ప్రత్యేక ఆకర్షణ.
- యుద్ధ సన్నివేశాలను కళ్లకు కట్టే వేల టిన్ సైనికుల బొమ్మల క్షేత్రాలు కట్టిపడేస్తాయి.
- ఫర్నీచర్, ఇంటీరియర్ వస్తువులతో కూడిన బొమ్మ ఇళ్లు చిన్నారులతో కేరింతలు కొట్టిస్తాయి.
- రాజుల కాలం నాటి శైలిలో మినియేచర్ గదులు, మందిరాలు చూపు తిప్పుకోనీయవు.
- టెడ్డీ బేర్ల పెద్ద సేకరణ ఉంది. ఇదే మ్యూజియానికి హైలెట్.
- గంటల తరబడి చూసిన టెడ్డీ బేర్ల గది నుంచి బయటికి రాలేరు.
- నగర జీవనాన్ని ప్రతిబింబించే బొమ్మ పట్టణాల మోడళ్లు మొదటి అంతస్తులో ఉంటాయి.
- పేపర్ బోయ్‌లు, ట్యాక్సీలు, రోడ్డు పక్కన షాపులు, పెద్ద భవంతులు భలే గమ్మత్తుగా ఉంటాయవి.
- వివిధ రకాల వృత్తులు చేసేవారి వేషధారణ, పనిముట్లతో కూడిన బొమ్మలున్నాయి.
- మరో మంచి అంశమేమిటంటే ఇష్టమొచ్చినన్ని ఫొటోలు ఇక్కడ దిగొచ్చు. ఫొటోలు తీసుకోవడానికి ఏ అభ్యంతరం లేదు.

ప్రేమ ప్రత్యేకం

జార్జి ఆర్చిబాల్డ్ ప్రపంచవ్యాప్తంగా పేరొందిన పక్షి శాస్త్రవేత్త. కనుమరుగైపోతున్న వూపింగ్ క్రేన్ జాతిని కాపాడాడు. ఈ జాతి కొంగలు వందల సంఖ్యలోనే మిగిలాయి. అవీ రికార్డుల్లో లేవు. దొరికిన ఈ ఒక్క ఆడ కొంగ ద్వారా ఆ జాతిని కొనసాగించడం అసాధ్యమనే అనుకున్నారు అంతా. కానీ ఆర్చిబాల్డ్‌కు పక్షుల ప్రవర్తనపై పూర్తి అవగాహన ఉంది. అవి గుడ్లు పెట్టాలంటే తమకు నచ్చిన జత కావాల్సిందే. వాటి అంగీకారం లేకుండా కృత్రిమంగా సెమెన్‌ను ఎక్కించినా అది విఫలమౌతుంది. దానికోసం సాన్ యాంటోనియో జూలోని ఓ కొంగను ప్రేమలోకి దింపాడు. కృత్రిమంగా గుడ్లు పెట్టేలా దాన్ని సిద్ధం చేశాడు. మూడేళ్లపాటు దానితో కలిసి బతికి తన మాట వినేలా మార్చు కున్నాడు. దాన్ని ఉంచిన బోనులోనే దానితో కలిసి గూడు కట్టుకుని నివసించాడు. జూ అంతా చెట్టా పట్టా ల్ వేసుకని తిరిగి స్నేహం చేశాడు. రెండు మూడు సార్లు విఫలమైనా చివరకు ఆ గుడ్లను విజయవంతంగా ల్యాబ్‌లో పొదిగించగలిగారు. కనులు తెరిచిన బుల్లి కొంగకు తన పేరిట 'గీ విజ్'గా పేరు పెట్టి సొంత బిడ్డ లా మురిసిపోయాడు. ఆ పిల్లకు ఇపుడు ముప్పై ఏళ్లు వచ్చాయి. అది మరో పిల్లకు తల్లైంది కూడా. తాను అనుసరించిన విధానం ద్వారా చాలా పక్షి జాతులను కాపాడాడు ఆర్చిబాల్డ్. భారత్, ఆఫ్ఘన్, క్యూబా, రష్యాల్లో కూడాసేవలు అందించాడు. ఒరకంగా పక్షులతో ప్రేమలో పడిపోయాడు.వాటికి తండ్రిలా చెప్పుకుంటాడు.

అల్పాకా సాక్షిగా...

అల్పాకాలు స్వచ్ఛమైన శ్వేత వర్ణంలో చూడటానికి ఎంత ముచ్చటగా ఉంటాయో. మెత్తటి ఒత్తైన జుత్తుతో అవి టెడ్డీ బేర్ బొమ్మల కన్నా ముద్దొచ్చేస్తుంటాయి. జపాన్ వాళ్ల ప్రియమైన వన్యప్రాణుల్లో అవి ఒకటి. వాటిని థెరపీలో భాగంగా జపాన్ వృద్ధుల సంరక్షణ కేంద్రాలు, ఆస్పత్రుల్లో తిప్పుతుంటారు. వాటి చెలిమి ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఉత్సాహాన్ని పెంచుతుందని తేలింది. వీటినిపుడు పెళ్లిళ్లకు ఛీఫ్ గెస్ట్ చేసేస్తున్నారు అక్కడి ఎపినార్డ్ నాసు హోటల్ వారు. మిగతా అతిథుల్లా ఇదీ వధూవరులకు నప్పే అలంకరణలు చేసుకుని అందరి కంటే ముందు వరసలో నిల్చుని ముచ్చటైన జంటల వివాహానికి సాక్షి అవుతోంది. రింగ్‌లు తొడిగాక పెళ్లి జంటలు దీనితో ఫొటోలు దిగేందుకే తొలి ప్రయారిటీ ఇస్తున్నాయి. వధువులైతే వరుడు అసూయపడేలా మరీ హత్తుకుని తమ ప్రేమను చాటుతున్నారట. తమ పెళ్లి ఆల్బమ్‌లో అల్పాకాతో దిగిన ఫొటోలకు ప్రత్యేక స్థానమివ్వడంతో పాటు వాటిని ఫేస్‌బుక్‌లో పోస్టులు మీద పోస్టులు చేస్తున్నారు. వాటిని చూసి పెళ్లంటే అల్పాకా సమక్షంలోనే చేసుకోవాలని అనుకుంటున్నారు అక్కడి యువత. అల్పాకాల సాక్షిగా పెళ్లి చేసుకోవడం పాపులరైపోయింది. అల్పాకాలు పెళ్లి సందడిలో ఆహ్లాదాన్ని కలిగించడంతో పాటు వధూవరుల్లో పాజిటివ్ ప్రభావాన్ని కలిగిస్తున్నాయట.



ఒక్కడి సూపర్ కార్..

ఈ మధ్యే జరిగిన హైనాన్ అంతర్జాతీయ కార్ల ప్రదర్శనలో దుమ్ములేపిన కారది. వీక్షకులు కారు చుట్టూ మూగి సెల్ఫీలు తీసుకున్నారు. ఈ సూపర్ కారును ఏ లంబోర్గినీనో, ఫెరారీనో తయారుచేసిందని అనుకున్నవారికి షాక్ ఇచ్చేలా ఓ 27 ఏళ్ల కుర్రాడు తానొక్కడే రూపొందించానంటూ ముందుకొచ్చాడు. చైనాకు చెందిన యువ ఇంజినీర్ చెన్ యింక్సీ ఒక్కడే ఐదు నెలలు కష్టించి ఈ కారుకు ఈ లుక్ తీసుకొచ్చాడు. ఆటోమొబైల్ ఇంజినీరింగ్‌లో ఉన్నత చదువు చదివిన చెన్‌కు కార్ల రూపకల్పన అంటే ప్రాణం. భవిష్యత్తును శాసించే ఓ సూపర్ కార్‌కు తానే రూపకల్పన చేయాలని కలలు కనేవాడు. రెండేళ్లపాటు ఆ విద్యను అభ్యసించి వచ్చాక చెన్ తండ్రి స్ట్రోక్ ఇచ్చాడు. ఈ కార్ల డిజైన్ అదీ ఇదీ విడిచి ఎంచక్కా తమ సొంత ఫ్యాక్టరీని దగ్గరుండి నడపాలని పట్టుబట్టాడు. కాలేజీ మాన్పించి ఫ్యాక్టరీకి కట్టేశారు. కానీ, చెన్ వెనక్కు తగ్గలేదు. ఒక్కడే తన గ్యారేజీలో కారును రూపొందించడం మొదలెట్టాడు. అద్భుతమైన డిజైన్‌తో కారు సిద్ధమైంది. ఇంకొన్ని మెరుగులు దిద్దేందుకు మార్పుచేర్పులు చేస్తుండగా హైనాన్ ఆటో షో ప్రారంభ తేదీ ఖరారైంది. ఎక్స్‌టీరియర్‌కు ఫినిషింగ్ ఇచ్చి, ఇంటీరియర్‌కు తను అనుకున్న మార్పులను వాయిదా వేసి ప్రదర్శనలో నిలిపాడు.

ఆయన రచనలు సామాన్యుని దైనందినాలు. రాజకీయంపై సూటైన ప్రశ్నలు. గ్రామ సీమకు పట్టుగొమ్మలు. 42 ఏళ్లలో 28 రచనలకు 37 అవార్డులు గెలుచుకున్న పాన్‌వాలా లక్ష్మణ్ రావుకు షేక్స్‌పియర్ నాడి తెలుసు. భారతీయ రాజనీతి వాడి తెలుసు. నాలుగు దశాబ్దాల ఈ సాహితీవేత్త ఓ చాయ్‌వాలా. పాన్‌లు చుట్టిన చేతుల నుంచి జాలువారిన అక్షరాలు ఢిల్లీ బస్తీవాలా జీవితాల్ని తట్టాయి. ఇప్పుడు ఆయనందించే తేనీరంత కమ్మగా ఉంటాయా రచనలు.

స్ఫూర్తి రచయిత

మహారాష్ట్ర అమ్రావతి జిల్లాలోని తారే గావ్ గ్రామానికి చెందినవాడు లక్ష్మణ్‌రావు. పేదరికంలో పుట్టి పెరిగిన అతడికి ప్రాణమిత్రులు హిందీ సాహిత్యాన్ని పరిచయం చేశారు. 8వ తరగతి డ్రాపౌట్ అయిన లక్ష్మణ్‌రావు పని వెదుక్కుంటూ భోపాల్ బాట పట్టాడు. ప్రఖ్యాత హిందీ నవలాకారుడు గుల్షన్ నంద రచనలు చదువుతూ పెరిగిన లక్ష్మణ్ రావుకు సాహిత్యంపై మక్కువ ఎక్కువైంది. ధాబాలు, హోటళ్లలో పనిచేసుకుంటూనే దూరవిద్యలో చదువు కొనసాగించాడు. అక్కడి సంపాదన కుటుంబానికి సరిపోక 1975లో దేశ రాజధాని ఢిల్లీకి చేరకున్నాడు. పాన్ బడ్డీ పెట్టుకుని పొట్ట నింపుకునేవాడు. ఆ పని చేస్తూనే బీఏ పూర్తిచేశాడు. దిగంబర్ రోడ్డులోని ఐటీవో హిందీ భవన్ దగ్గర చాయ్ దుకాణానికి పని మార్చాడు. అప్పటికే ఎంతో మంది హిందీ రచయితలను చదివిన లక్ష్మణ్ రావుకు తాను ఒక పుస్తకం రాయాలని కాంక్ష పెరిగింది. స్థానికంగా పబ్లిషింగ్ కంపెనీలు ఎక్కువగా ఉండటంతో తన పని సులభమవుతుందని ఊహించాడు. కానీ ఆయనకు చీదరింపులు, వెక్కిరింతలు ఎక్కువయ్యాయి. ఓ పాన్‌వాలా రచయితా అంటూ ఎగతాళి చేశారు. కొందరు పబ్లిషర్లు తన మాట విన్నా సొంత ఖర్చుతో అచ్చు వేయించుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. ఒక్కో పైసా కూడబెడుతూ 18 ఏళ్ల ప్రాయంలో 1979లో తన తొలి రచన 'నయీ దునియా కీ నయీ కహానీ' అచ్చు వేయించాడు. అది చదువరులను ఆకట్టుకుంది. ఈ విషయం తెలిసిన ఓ పత్రిక వారు అతడి ప్రత్యేకతను తెలుపుతూ వార్త ప్రచురించారు. మంచి గుర్తింపు లభించడంతో తర్వాతి రచనల ముద్రణలకు కాళ్లు అరిగేలా తిరగాల్సిన బాధ తప్పింది. లక్ష్మణ్‌రావు రాసిన 'రామ్‌దాస్' నవలకు అవార్డు దక్కడంతో పాటు దాన్ని నాటకానికి అన్వయించారు. సొంత గ్రామానికి చెందిన ఓ సాహసవంతమైన కుర్రాడి యదార్థ జీవితం ఆధారంగా దాన్ని రచించారు. ఆ కుర్రాడు నదిలో కొట్టుకుపోయి మరణించడంతో చలించిపోయిన లక్ష్మణ్‌రావు అతడి కథను ఎంచుకున్నారు. నాటకమూ విజయవంతమై ఇందిరా గాంధీ దృష్టిలో పడింది. ఆమె లక్ష్మణ్‌రావును ప్రత్యేకంగా ఆహ్వానించి తీన్‌మూర్తి భవన్‌లో సన్మానించి గౌరవించారు. తర్వాత 'భారతీయ సాహిత్య కళా ప్రకాశన్' పేరిట పబ్లికేషన్ ప్రారంభించారు. ఇప్పటి వరకు 28 పుస్తకాలు రాయగా, 'రేణు' అనే నవలను అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చదివి లక్ష్మణ్ రావుపై ప్రశంసలు కురిపించారు. స్వయంగా ఆహ్వానించి రాష్ట్రపతి భవన్‌లో ఆతిథ్యం ఇచ్చారు. షేక్స్‌పియర్ విజయ రహస్యం సామాన్యుడి జీవనం, ఆలోచనే అని చెప్పే లక్ష్మణ్‌రావు పాత్రలు కూడా సామాన్యులే. రాజకీయాలపై స్పష్టమైన అవగాహన ఉన్న ఆయన 'ప్రధాన మంత్రి', 'పరంపర సే జుడీ భారతీయ రాజ్‌నీతి', 'పట్టియోంకీ సరసాత్' వంటి రచనలు చేశారు. ఇంద్రప్రస్థ సాహిత్య భారతీ అవార్డుతో పాటు ఎన్నో అవార్డులు గెలుచుకున్న ఆయన్ను 'చాయ్‌వాలా లేఖక్'గా స్థానికులు పిలుచుకుంటారు. ఇప్పటికీ హిందీ భవన్ ఎదురుగా ప్లాట్‌ఫామ్‌పై చాయ్ అమ్ముతూ కనిపించే లక్ష్మణ్ రావు వంట సామాను పక్కనే అందంగా సర్దిన అతడి రచనలుంటాయి. ఉదయం టీకొట్టు, రాత్రిళ్లు రచనతో 63 ఏళ్ల వయసులోను కష్టపడుతున్న ఆయన తన ఇద్దరు కుమారులను పైచదువులు చదివిస్తున్నారు. చిన్న కుమారుడు చదువుతున్న ఢిల్లీ విశ్వవిద్యాలయంలో తాను ఎం.ఏ. దూరవిద్యలో చదువుతున్నాడు. పుస్తకాలు రాయడానికి పెద్ద చదువులతో పని లేదని లోకాన్ని, మనుషులను చదివితే చాలని చెప్పే లక్ష్మణ్‌రావు ఎందరికో స్ఫూర్తిగా .

సంతోషాలతో నింపేస్తూ జీవితాన్ని వేడుక చేసుకునేది స్పెయిన్‌లోనే. ల్యాండ్ ఆఫ్ ఫెస్టివల్స్‌గా పిలిచే స్పెయిన్‌లో కొన్ని సంబరాలు జీవితాంతం నిల్చిపోయే అనుభూతిని మిగులుస్తాయి. ఒక్కసారైనా వాటిలో పాల్గొనాలని ఆరాటపడే రాసుకునే పర్యాటకులు ఎందరో. వారి సంస్కృతి సంప్రదాయాలతో పాటు సంతోషంగా గడపడం ఎలానో చూపిస్తారు స్పెయిన్‌వాసులు. వారి ఆనందాల్లోకి పర్యాటకులనూ లాక్కెళ్లి సొంతం చేసేసుకుంటారు. ఆ ఉత్సవం వారిదీ చేసేస్తారు. ఇప్పుడా ఫెస్టివల్స్ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించాయి. మిగతా దేశాల్లోనూ వాటిని అనుకరించి పండగ చేసుకుంటున్నారు.

సంబరాల స్పెయిన్

టొమాటోల దాడి

లా టొమాటీనాగా స్పెయిన్‌వాసులు పిలుచుకునే ఈ ఉత్సవాన్ని హృతిక్ రోషన్ 'జిందగీ మిలేగీ న దుబారా' చిత్రంలో చిత్రీకరించారు. టొమాటోలను ఒకరిపై ఒకరు విసురుకుంటూ ఆటపట్టించే ఈ ఫెస్టివల్‌లో సంగీతమూ ప్రధానమే. వీధులు, మనుషులు టమాటాలతో తడిసి ముద్దైపోతే ఆ ప్రాంతమంతా ఎర్రటి తివాచీ పరుచుకున్నట్టుగా అనిపిస్తుంది. వాలెన్సియాకు గంట దూరంలో ఉండే బునోల్‌లో దీన్ని నిర్వహిస్తారు. ఏటా మార్చి 14 నుంచి 19 వరకు నిర్వహించే ఈ ఫెస్టివల్‌కు ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు వస్తారు. సుమారు 3500 మంది స్థానికులు టొమాటోల దాడికి వ్యూహాలు రచిస్తుంటారు.

దీపావళి

లాస్ ఫల్లాస్ ఉత్సవం దీపావళి పండుగని పోలి ఉంటుంది. కానీ ఇక్కడ దీపాల బదులు రంగురంగుల విద్యుత్ కాంతులతో వాలెన్సియాను ధగధగలాడిస్తారు. నినోట్స్‌గా పిలువబడే భారీ కార్డ్‌బోర్డ్ ఆకారాల్ని నెలల తరబడి కళాత్మకంగా రూపొందిస్తారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక తాజా పరిణామాలపై వ్యంగ్యంగా, హాస్యభరితంగా వాటిని తయారు చేస్తారు. వాటిని పర్యాటకులు, వీక్షకులకు ప్రదర్శించి కనువిందు చేస్తారు. బ్రాస్ బ్యాండ్స్ సంగీతంతో ఆ ప్రాంతాన్ని మోతెక్కిస్తారు. ప్రదర్శన పూర్తయ్యాక బాణాసంచాను భారీగా కాల్చి వసంతానికి స్వాగతం పలుకుతారు.

సంస్కృతి ఆతిథ్యం

స్పెయిన్ ఆచారాల్ని కళ్లకు కడుతుంది పురాతన పట్టణం కార్డొబాలో జరిగే పేషియోస్ ఫెస్టివల్. వారి సంస్కృతి ఉన్నతిని ప్రతిబింబిస్తూ వీధులన్నీ తెల్లని వెల్లతో స్వచ్ఛంగా కనిపిస్తాయి. భవనాల పేషియోల్లో అందమైన మల్లెపూల తొట్టెలతో అలంకరిస్తారు. జెరేనియం, ముద్ద మందారాలతో అదనపు అందాన్ని ఆపాదిస్తారు. మే రెండో వారంలో ఆ వీధుల వెంట నడుస్తుంటే మల్లెల మత్తులో తేలిపోవాల్సిందే. అక్కడి పురాతన శైలి భవనాలు, మంద్రంగా వినిపించే సంప్రదాయ ఫ్లెమెన్కో సంగీతం, సంప్రదాయ వంటకాలతో విందులు, నారింజల కమ్మదనం ఇలా పర్యాటకులకు కొత్త ప్రపంచాన్ని చూపిస్తుంది. ప్రపంచ వారసత్వ సంపద ఇది.

గుడారాల్లో విందు

సెమానా సాంటాగా పిలుచుకునే హోలీ వీక్‌కు రెండు వారాల అనంతరం ఏప్రిల్‌లో ఫెరియా డి ఏబ్రిల్ నిర్వహిస్తారు. అండాలూసియాలోని సెవిల్లేలో జరిగే ఈ ఉత్సవం వారం రోజులపాటు ఉంటుంది. సోమవారం అర్ధరాత్రిన మొదలయ్యే సంబరాలు తర్వాతి ఆదివారం రాత్రితో ముగుస్తుంది. అండాలూసియా సంప్రదాయ వస్త్రధారణతో స్థానికులు అక్కడి ఫెయిర్ గ్రౌండ్‌కు చేరుకుంటారు. సుమారు 1000 కాసెటాలనే గుడారాలను వేసి అక్కడే అన్ని కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. సంగీతం, నృత్యం, విందులతో వారమంతా సందడి చేస్తారు. బాణాసంచా పేలుళ్లతో సంబరాన్ని ముగిస్తారు.

మానవ కోటలు

యునెస్కో మానవ జాతి సాంస్కృతిక వారసత్వ సంపదగా గుర్తించబడిన 'సిటీ ఆఫ్ హ్యూమన్ కేజిల్స్' టారాగోనా సంబరాలు ప్రత్యేకం. జూన్ 24 నుంచి సెప్టెంబర్ 24 వరకు నిర్వహించే ఈ భారీ ఉత్సవానికి ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులకందరికీ ఘనమైన స్వాగతం పలుకుతుందీ నగరం. ఉత్సవానికి ఉండాల్సిన ప్రతి అంశంతోపాటు ఇక్కడ నిర్వహించే మానవ కోటల పోటీలు ఆకట్టుకుంటాయి. మనుషులే స్తంభాల్లా నిలబడి ఎత్తైన కోట ఆకారం నిర్మించడమే పోటీ. ఆరు నుంచి పది అంచెల్లో నిలబడే జట్ల విన్యాసాలు ఒళ్లు గగుర్పొడుస్తాయి. కావాలంటే ఆయా జట్లతో కలిసి పర్యాటకులు సరదాగా పోటీల్లో పాల్గొనొచ్చు. అక్కడ తప్పక హాజరవ్వాల్సిన, చూడాల్సిన కార్యక్రమాలు, ప్రాంతాల పర్యాటకుల కోసమే అందించే గైడెడ్ టూర్లు మంచి పేరు సంపాదించాయి.

రోటీ బ్యాంకు

> బుందేల్‌ఖండ్‌లో రోటీ బ్యాంకు ఉంది. నగదు బదులు అక్కడ రొట్టెలను జమ చేస్తారు. ఇంటి ముందుకే వచ్చిన బ్యాంకు సిబ్బంది వాటిని తీసుకుని లెక్కలు రాసుకుంటారు. అక్కడ డిపాజిట్ అయిన రొట్టెలు అన్నార్తుల ఆకలి తీర్చి ఖాతాదారులకు మానవత్వ ఖాతాను, తృప్తిని వడ్డీతో సహా చెల్లిస్తోంది.

వెనుకబడిన ప్రాంతమైన బుందేల్‌ఖండ్‌లోని మహోబా జిల్లాలో కొందరు యువకుల ఆలోచనే రోటీ బ్యాంకు. అక్కడి ప్రభుత్వాసుపత్రులకు వచ్చిన పేదలు, నిరాదరణకు గురై రైల్వేస్టేషన్లలో మగ్గుతున్న వృద్ధులు, కాశీరాం కాలనీకి చెందిన బీదబిక్కి వెతలు వారికి కొత్త విషయం కాదు. తాము కూడగట్టిన డబ్బుతో ఎంతమందికని ఆకలి తీర్చేది. వారిది మితాదాయమే. కళ్ల ముందే ఆకలితో నకనకలాడుతూ సోలిపోయిన వీధి బాలల నిస్సారమైన చూపులు వారి ప్రయాణాలకు టాటాలు, బైబైలు చెప్పేవి. ఆ చూపులు నిద్రపట్టనిచ్చేవి కావు. తమ ప్రాంతంలో ఏ ఒక్కరూ ఖాళీ కడుపుతో నిద్రపోకూడదని నిర్ణయించుకున్నారు. రోటీ బ్యాంకును తెరముందుకు తెచ్చారు. బుందేలీ సమాజ్ పెద్ద హాజీ ముద్దాన్ వీరికి అండగా నిలిచాడు. మరో నలుగురు పెద్దలు 40 మంది యువత కలిసి రోటీ బ్యాంకును నెలకొల్పారు. ఇంటింటికీ తిరిగి వారి బ్యాంకు సేవలను వివరించారు. ఇంట్లో వృథాగా పోయే రోజుకు రెండు రొట్టెలను తమకు అందిస్తే వాటిని పాడుచేయకుండా అన్నార్తులకు అందిస్తామని, తప్పు లేకుండా జమలెక్కలు రాసుకుంటామని గృహిణులకు చెప్పారు. పాడైపోయిన వాటిని కాకుండా తాజాగా ఉన్న రొట్టెలను సేకరించేందుకు సరైన సమయానికి రొట్టెల బాక్సులను తీసుకుని స్వయంగా యువకులే ఇళ్లకు వెళతారు. తమ రిజిస్టర్‌లో నమోదైన ఇళ్ల తలుపులను తట్టి తమ బ్యాంకు నినాదాన్ని వినిపిస్తారు. వారిచ్చిన రొట్టెలను మొహల్లా మిల్కీపూర్‌లోని కార్యాలయంలో జమ చేస్తారు. వాటిని గుర్తించిన ప్రాంతాలకు తీసుకెళ్లేది మరో జట్టు. స్థానిక ఆస్పత్రులు, పేదల నివాసాలు, రైల్వే స్టేషన్, వీధి బాలల కేంద్రాలకు చకచకా వాటిని తరలిస్తారు. రొట్టెలు పాడవకుండా బ్యాంకులో నిల్వచేస్తారు. తొలుత 10 ఇళ్లవారు రొట్టెలను ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఆ తర్వాత క్రమక్రమంగా 400 ఇళ్ల నుంచి రొట్టెలు అందుతున్నాయి. వీటన్నింటి నుంచి వచ్చిన 800 రొట్టెలు చాలామంది ఆకలిని తీరుస్తున్నాయి. రొట్టెలతో పాటు కూరగాయలను కూడా సేకరిస్తున్నారు. మహోబా పట్టణాన్ని 8 సెక్టార్లుగా చేసుకుని, ప్రతి సెక్టార్‌కు ఒక కూడలిని ఎంచుకుని చాలా పక్కాగా ఈ కార్యక్రమాన్ని రోజూ ఎటువంటి ఆటంకం కలగకుండా నిర్వహిస్తున్నారు. నీరసంతో చేయి నోటికి అందించలేనివారికి స్వయంగా యువతే రొట్టెలను తినిపించడం చూసి చలించిపోయిన వారు జట్టులో చేరుతున్నారు. ప్రతి గృహంలో ఏదో ఒక రకంగా ఆహారం వృథా అవుతోందని దీన్ని అన్నార్తులకు అందిస్తే చాలా వరకు ఆకలి సమస్య సమసిపోతుందని వారు చెబుతున్నారు. చాలా మంది గృహిణులకు వృథా ఆహారాన్ని పేదలకు అందించాలని ఉన్నా సమయం, అందుబాటు సమస్యలున్నాయని తాము గ్రహించామని వివరించారు. అలా ఇవ్వజూపినా కొందరు ఆత్మాభిమానం గల పేదలు దాన్ని భిక్షగా భావించి చేయి చాపరని అసలైన విషయాన్ని పట్టారు. అదే ఓ సంఘంగా అందరికీ చేర్చితే అది మానవతా కార్యక్రమంగా వస్తుందని, వాటిని తీసుకునేందుకు వెనుకాడరని రోటీ బ్యాంకు యువత వివరిస్తోంది. విజయవంతమైన తమ ఆలోచనను మరింత విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రోటీ బ్యాంకుపై దాతల విశ్వాసం సడలకుండా వారు అందించే ఆహారం వృథా కాకుండా ఓ జట్టు పట్టణంలో తిరుగుతూ అన్నార్తుల లిస్టును తయారుచేస్తుంది. పక్కా వ్యూహంతో ఒక్క రొట్టె కూడా వృథా పోకుండా అన్నార్తుల పొట్ట నింపడమే వీరి లక్ష్యం. బొట్టు బొట్టూ కలిసి సముద్రం అయినట్టు, రొట్టె రొట్టె కలిసి ఆకలిని ఆ ప్రాంతం నుంచి వెళ్లగొడుతోంది. ✦

స్వర స్మరామి

కెరటాలు, వాన జల్లులు, రైలు బోగీలు, కోవెల గంటలు, ప్రేయసి అందెలు, ప్రియుడి ఈలలు, కూలీల నిశ్వాసాలు, కోయిల అరుపులు అంతటా సంగీతమే. లయ కలిగిన ప్రతి సవ్వడి సంగీతమే. ఆ సంగీతమే లేకుంటే జీవితం ఓ తప్పిదం అన్న ఫ్రెడరిక్ నీషేతో శృతి కలుపుతూ ప్రపంచ సంగీతోత్సవానికి బాణీ కట్టింది ఫ్రాన్స్. కొద్ది రోజుల కిందట అంతర్జాతీయ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకొని 120 దేశాలు రోజంతా సంగీత విందుతో సందడి చేశాయి. ఈ సందర్భంగా మన దేశంలోని సంగీతమూర్తులు కొందరిని స్మరిస్తూ.. సంగీతానికి ఎల్లలు లేవని చాటిన తమిళ పల్లెల్ని నిద్ర లేపే తెలుగువాడైన త్యాగరాయుని భారతీయ సంగీత వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని మన సంగీతాన్ని అంతర్జాతీయ వేదికనెక్కించిన మహనీయులు వీరంతా..

మియాన్..

మియాన్ తాన్‌సేన్ (1506–1589) మొఘల్ చక్రవర్తి అక్బర్ దర్బార్‌లోని నవరత్నాల్లో ఒకరు. భారతీయ సంగీతానికి ఘనకీర్తిని తెచ్చినవారిలో ఒకరు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేవి ఆయన రాగాలు.

తీయని గొంతుక

లతా మంగేష్కర్ (1929–) సినిమా సంగీతానికి మహత్తును తెచ్చిన గొంతుక. 70 ఏళ్లుగా తన మృదువాణిని వినిపించిన గాన కోయిల. గాత్రకారుల్లో భారత రత్న పొందిన వారిలో సుబ్బులక్ష్మి తర్వాత లతానే.

స్వరశాల



ఇళయరాజా (1943–) దక్షిణ సంగీత దక్షతకు నిదర్శనం. దక్షిణాది చిత్రాలకు పాట కట్టి వెలలేని సంగీత సంపదను మూటకట్టారు. భాషల హద్దులు దాటి సంగీతానికి ఎల్లలు లేవని వినిపించారు. సినిమా సంగీతానికి గుండెల్లో కోవెల కట్టుకునేలా చేశారు.

వాయులీనం

డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యం (1947–) వాయులీనంలో లీనమవ్వని వారుండరు. వయోలిన్‌కు సంగీత అభిమానులు పట్టం కట్టేలా చేసిన విద్వాంసుడాయన.

అంతర్జాతీయం



పండిట్ రవి శంకర్ (1920–2012) ఖ్యాతి అంతర్జాతీయం. విదేశాలను ఊపేసిన బీటిల్స్ బృందంలోని జార్జ్ హారిసన్, ది బైర్డ్స్ ఆయన అభిమానులు, శిష్యులు. మనదేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న', బ్రిటిష్ రాజ్యపు 'నైట్ కమాండర్' అవార్డు వరకు ఎన్నో పురస్కారాలు ఆయన సేవల్ని గుర్తించాయి. మూడు సార్లు గ్రామీ అవార్డులు గెలుచుకున్న ఆయన తన సంగీతంతో ఎందరో అభిమానుల హృదయాలనూ గెలుచుకున్నారు.

రవీంద్ర గీతం

రవీంద్రనాథ్ టాగూర్ (1861–1941) గొప్ప సాహిత్యకారుడే కాదు సంగీతకారుడు కూడా. 2,230 స్వరాలను కూర్చారాయన. రాగాలు, సాహిత్యం అన్నింటినీ ఇట్టే పొందుపరిచేవారు. ఆయన పేరిటే ఉన్న రవీంద్రసంగీత్ శైలి విలక్షణీయమైందిగా పేరొందింది.

వాహ్ ఉస్తాద్



జాకీర్ హుస్సేన్ (1951–) తబలా చప్పుడు భూగోళమంతా ప్రతిధ్వనించింది. చిన్న వయసులోనే వాహ్ ఉస్తాద్ అనిపించుకున్నాడు. ప్రతి మిల్లీ సెకండ్‌కు బీట్‌ను చరవగలిగిన ఆయన సంగీతానికి శ్రోతలవడం అదృష్టం.

తెలుగుధనం



ఘంటసాల వెంకటేశ్వరరావు (1922–1974) తెలుగు పాటకు వెలుగు రేడు. గాంభీర్యమైన ఆ గొంతు బరువైన జీవిత చిత్రాలనెన్నింటినో చెప్పింది. తెలుగులోని తీపిని అందరికీ పంచి తన పాటను ప్రతి నోట పలికించిన కంఠశాలగా పేరు తెచ్చుకున్నారు.

వేణువుకు వాయువు

హరిప్రసాద్ చౌరాసియా (1938–) వేణు గాలుల్లో మన మనసులు అలల్లా తేలిపోతాయి. భావ తీవ్రతలోకి లాక్కెళ్లే వేణు గీతాలు ప్రపంచమంతా వీచాయి. అతడి మురళీగానానికి ప్రపంచం పరవశించింది.



షెహనాయ్ మంత్రం

బిస్మిల్లా ఖాన్ (1913–2006) షెహనాయ్ అంతరాలు లేని సంగీతానికి ద్వారాలు తెరిపించింది. భారతీయ సంస్కృతికి షెహనాయ్‌ను సంకేతంగా చేసిన ఆయన కీర్తి గణించలేనిది. 'భారత రత్న'కే ప్రత్యేకత తెచ్చింది ఆయన ప్రతిభ.

బరువైన పాట

మహమ్మద్ రఫీ (1924–1980) లేని బాలీవుడ్‌ను కలలో కూడా ఊహించలేం. రఫీ గీతాలు ఆ పాత మధురాలు. ఐపాడ్ తరంలోను ఆయన పాటల కలెక్షన్లు డిస్క్ స్పేస్‌ను ఆక్రమించేస్తాయి. బాలీవుడ్ సంగీతంలో సుస్వరం రఫీ.

సంగీత కీర్తి

ఎమ్మెస్ సుబ్బులక్ష్మి (1916–2012) భారతీయ సంగీత కీర్తి ప్రపంచమంతా ధ్వనించేట్టు చేశారు. మద్రాస్ మ్యూజిక్ అకాడమీలో తొలిసారిగా 13 ఏళ్లపుడు ఆమె ఇచ్చిన ప్రదర్శన ఆహుతుల్ని కట్టిపడేసింది. 'భారత రత్న'తో గౌరవించిన తొలి సంగీతకారిణి ఆమె.

గజ(ల్) మల్లె

బేగం అఖ్తర్ (1914–1974)ను మల్లికా–ఇ–గజల్‌గా పేరు తెచ్చుకున్నారు. ఆమె గజల్స్ అంత అద్భుతంగా ఉంటాయి. హృదయాన్ని గుప్పిట పట్టే ఆమె భావాలు ఆలోచనలో పడేస్తాయి. మనసును బరువెక్కించే తేలిగ్గా సాగిపోయే ఆమె గజల్స్‌లో ఎంతో లోతు ఉంది.

అట్టమీది కథ

సౌర రథాలు

మనిషి పక్షిని చూశాడు. రెక్కలు కట్టుకుని ఎగరాలనుకున్నాడు. మనిషి చేపను చూశాడు. మొప్పల్ని తొడిగి సముద్రం అడుగుకు చేరాలని కలలు కన్నాడు. మనిషి చెట్టునూ చూశాడు. సూర్యుడి నుంచి శక్తిని గ్రహించి కాయనో పండునో పొందాలనుకున్నాడు. రెక్కలు లేకపోతేనేం విమానాలు దాటి రాకెట్లనెక్కి చందమామను పలకరించాడు. మొప్పలు తొడగకపోతేనేం స్కూబా డైవ్‌లు దాటి జలాంతర్గాముల్లో యేళ్లకు యేళ్లు గడిపేస్తున్నాడు. కాంతిని విద్యుత్ శక్తికి మళ్లించి గెలిచాడు. సౌర విద్యుత్ శక్తి ఇపుడు కాయే కావొచ్చు.. అదే పండై భవిష్యత్తును పండించబోతోంది. వాహన ఇంధన అవసరాలకు ఫలం కాబోతోంది. భవిష్యత్తు ప్రయాణానికి ఇంజిన్ స్టార్ట్ చేశాయీ సౌర రథాలు.

మనం ఇప్పుడు ఒక టైమ్ బాంబ్ మీదుగా బతుకు బండి లాగిస్తున్నాం. అది పేలితే ప్రపంచం స్తంభించి పోతుంది. అంతా అస్తవ్యస్తం అయిపోతుంది. అదే క్రూడ్ ఇంధనం. అతి త్వరలోనే భూమి మీది పెట్రోలియం నిల్వలన్నీ ఖాళీ అయిపోతాయని శాస్త్రవేత్తల లెక్క కట్టేశారు. 2052కు అని ఓ బృందం, 2067కు అని మరో బృందం లెక్కల్లో తేడానే గానీ విషయం మాత్రం ఒకటే. త్వరలో మన భావితరం పెట్రోల్ బంకు అనే మాట పుస్తకాల్లో చదువుతారని. 30 కోట్ల ఏళ్లుగా భూమి తయారు చేసిన ఇంధనాన్నంతటినీ కేవలం 200 ఏళ్లలో మనం తాగేశాం. ఎక్కువగా ఇంధనాన్ని తోడేస్తోంది గల్ఫ్ దేశాలైతే దాన్ని వాడేస్తోంది అమె రికా. ఇప్పుడా అమెరికా వద్ద కేవలం 13 ఏళ్లకు సరిపడా క్రూడ్, 14 ఏళ్లకు సరిపడా సహజ వాయువు మాత్రమే మిగిలాయి. రష్యాది అదే పరిస్థితి. మరో 27 ఏళ్లకు మాత్రమే ఇంధనం ఉంది. ఇక మన భారత్ పరిస్థితి వేరే చెప్పాల్సిన అవసరం లేదు. వారానికో సారి పెరిగే పెట్రోల్, డీజిల్ ధరలు మనమెంతగా ఇంధన దిగుమ తులపై ఆధారపడి ఉన్నామో తెలియజేస్తాయి.

గ్లోబల్ వార్మింగ్‌కూ ప్రధాన కారణమైన ఈ ఆయిల్ యుగం అంతమనేది వినాశాలతో కాక ప్రత్యామ్నాయ ఇంధన శక్తులతో ఉండాలన్న ఓ గల్ఫ్ నేత మాట వెనుక చాలా ఆవేదనే ఉంది. “రాతి యుగం అంతమనేది భూమి మీద రాళ్లు అయిపోవడంతో సంభవించలేదు. మనం లోహాలకు మారామంతే..” అనే మాటలు ప్రత్యామ్నాయంతో పాటు పునరుత్పాదక వనరుల ప్రాధాన్యాన్ని చెబుతున్నాయి. వాయు, సముద్ర, జల, జీవ వగైరా వగైరా ఇంధన వనరులున్నా పరిశోధకుల చూపు మాత్రం చెట్టుపై, చెట్టును కాయించే సూర్యుడిపై పడింది. ఫొటో సింథసిస్‌కు, ఫొటో వోల్టాయిక్‌కు తేడాలున్నా శక్తి రహస్యం మాత్రం ఒకటే. సూర్యరశ్మిని ఇంధనంగా మార్చుకోవడం. వేరే శక్తికి మరల్చుకోవడం. ఆ శక్తిని ప్రపంచాన్ని నడిపించే వాహనాలకు ఇంధనంగా సమకూర్చడమే ఇప్పటి ప్రధాన లక్ష్యం. యాభై ఏళ్ల క్రితమే లండన్‌లో చార్లెస్ అలెగ్జాండర్ అనే శాస్త్రవేత్త ముందు చూపుతో సౌర ఘటాలతో పనిచేసేలా 1912 మోడల్ బేకర్ ఎలక్ట్రిక్ కారుకు మార్పుచేర్పులు చేశాడు. అప్పుడు క్రూడాయిల్ పుష్కలంగా దొరకడంతో అదెవరికీ పట్టలేదు. మరో 30 ఏళ్ళు గడిచేసరికి వారి అడుగునున్న ఇంధనం ఆవిరైపోవడంతో కాళ్ల కింద భూమి కదిలిపోయినట్టు భయపడి మళ్లీ సౌరశక్తి వెంట పడ్డారు. సరిగ్గా వారం క్రితం ‘సోలార్ ఇంపల్స్’ ఒకే పెట్టున సుదీర్ఘ ప్రయాణాన్ని ముగించి రికార్డు సృష్టించే వరకు సౌర వాహన వినియోగం వేగవంతమైందని గానీ తెలియరాలేదు. సౌర శక్తితో నడిచే వాహనాల కోసం ప్రపంచం ఎదురుచూస్తోంది. ప్రపంచ దేశాలు వాటి తయారీకి పోటీపడుతున్నాయి. ఎడారి గల్ఫ్‌కు స్వర్ణయుగం తెచ్చిన క్రూడాయిల్ లానే సౌర శక్తి ఇంధనం, వాహన సాంకేతికత కూడా ఆ దేశాల ముఖచిత్రాన్నే మార్చేస్తాయి మరి. తరగని నిధైన ఉచితంగా అందే సౌరశక్తితో చవకైన వాహన, ఇంధనాల్ని తయారు చేయగలిగితే.. క్రూడ్ యుగం నుంచి సోలార్ యుగంలోకి మనిషి ప్రయాణం చేరిపోతుంది. రోడ్డు, రైలు, జల, వాయు, అంతరిక్ష మార్గాల్లో విప్లవాలు సంభవిస్తాయి.

స్పేస్ రేస్

ఇప్పటికే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి సౌరశక్తే ప్రధాన వనరు. సౌరశక్తితో నడిచే ఉపగ్రహాలు పక్కాగా పనిచేస్తున్నాయి. మార్స్‌పైకి, చంద్రునిపైకి పంపిన కొన్ని రోవర్లకు సౌరశక్తే ఇంధనం. జపాన్ 'ఇకారస్' పేరిట రూపొందించిన భారీ అంతరిక్ష నౌక ప్రధాన ఇంధనమూ సౌరశక్తే. ఈ స్పేస్ రేసులో భారత్, చైనాలు పోటీ పడుతున్నాయి. అంతరిక్షంలో సూర్యకాంతి తేలికగా సేకరించగల్గడమే దీనికి ప్రధాన కారణం. కానీ సమస్యల్లా భూమి మీదే. కొన్ని గంటలు మాత్రమే సూర్యుడి వెలుగు అందుబాటులో ఉంటుంది. మేఘాల అడ్డుగోడలు, శీతల ప్రాంతాల సవాళ్లు, రాత్రుల చీకటి సౌర వాహనాల ప్రగతికి ప్రధాన అడ్డంకులు. విద్యుత్‌ను నిల్వ చేసుకునే లిథియం అయాన్ బ్యాటరీల అధిక ధర కూడా సమస్యే. తేలికైన వాహన భాగాలతో భద్రతా ప్రమాణాల సమస్య. ఇప్పటి అవసరాలకు 1000 రెట్ల ఇంధనాన్ని సమకూర్చగల సామర్థ్యం ఉన్నా అందుకోగలిగింది కేవలం ఒక్క శాతం మాత్రమే. సౌర శక్తిని పట్టే సౌర ఫలకాల సామర్థ్యం 20 శాతమే. ఇవే సౌర వాహనాలను రోడ్డెక్కకుండా చేస్తున్నాయి. అయితే గడిచిన కొన్నేళ్లలో సాంకేతికత రంగం అనూహ్య మార్పుల్ని చూసింది. చాలా వేగవంతంగా టెక్నాలజీ అభివృద్ధి చెందుతోంది. ఇదే భవిష్యత్తుపై ఆశల్ని సజీవం చేస్తోంది. 50 నుంచి 100 శాతం సామర్థ్యానికి చాలా దగ్గరలోనే ఉంది నేటి పరిశోధన. ఇప్పటికే చాలా సౌర వాహన ప్రోటో టైపులు వచ్చేశాయి. అవి విజయవంతంగా తమ లక్ష్యాలను చేధిస్తున్నాయి కూడా.

సోలార్ విజయాలు

నమోదవుతున్న సౌర వాహన విజయాలు, సోలార్ సెల్స్‌పై జరుగుతున్న విప్లవాత్మక పరిశోధనలు సోలార్ శకానికి ఊపునిస్తున్నాయి. సౌర వాహన విజయంగా పేరొందిన 'సోలార్ ఇంపల్స్' పాత రికార్డులన్నింటినీ బ్రేక్ చేస్తూ ఇది ఏకధాటిగా 7900 కిలోమీటర్ల దూరం 120 గంటల్లో పూర్తిచేసింది. జపాన్ నగోయా నుంచి మొదలైన దీని ప్రయాణం ఈ నెలారంభంలోనే హవాయి ద్వీపాన్ని చేరింది. దాని భారీ రెక్కలపై 17 వేల సౌర ఫలకాల్ని ఉంచారు. నాలుగు లిథియం అయాన్ బ్యాటరీలతో ఇది నడిచింది. ఆండ్రూ బోర్స్‌బెర్గ్ నడుపుతున్న ఈ విమానం 35 వేల కిలోమీటర్ల లక్ష్య ఛేదనలో సాగుతోంది. ఈ ఏడాది మార్చి 10న మన దేశంలోని అహ్మదాబాద్‌కూ చేరుకుందిది. నాసా రూపొందించిన 'హీలియోస్' 2001లో 96 వేల 863 అడుగుల ఎత్తుకు చేరుకుని ఆశ్చర్యపరిచింది. అమెరికా మిలిటరీ 'వల్చర్' పేరిట దాదాపు ఐదేళ్లపాటు సౌరశక్తితో ఆకాశంలో మనగలిగే క్రాఫ్ట్‌ను రూపొందించడంలో నిమగ్నమైంది. 'ఎయిర్వి రాన్‌మెంట్', 'గోస్సెమెర్ పెంగ్విన్', సోలార్ చాలెంజర్, సన్ సీకర్ లాంటి ప్రాజెక్టులు కూడా గగన విహారానికి సౌరశక్తిని వాడుకునే పరిశోధనలో ఉన్నాయి. జెఫైర్ డ్రోన్‌లు, యూఏవీల్లో సౌరశక్తిని విజయవంతంగా ఉపయోగిస్తున్నారు.

రయ్.. రయ్..

వివిధ దేశాల్లో సోలార్ కార్లు చక్కర్లు కొడుతున్నాయి. ఆస్ట్రేలియాలో ఈవె, సోలార్ స్పిరిట్ 3, కెనడాలో స్కిన్లిచ్ డెల్టా, జర్మనీలో ఓపెన్ వరల్డ్, పవర్‌కోర్ సన్ క్రూజర్, సోలార్ వరల్డ్ జీటీ, ఇటలీలో పీ, మాబ్, జపాన్‌లో కైటాన్ 2, మొనాకోలో ఆస్ట్రోలాబ్, ఎసెలెస్టిక్, నెథర్‌ల్యాండ్స్‌లో స్టెల్లా, న్యూజిలాండ్‌లో అల్ట్రా కమ్యూటర్, స్లోవేనియాలో మెట్రాన్ 7, సూపర్ పైకీ, స్విట్జర్‌ల్యాండ్‌లో ఐ కేర్, సోలార్ ట్యాక్సీ, తైవాన్‌లో అపోలో సోలార్ క్రూయిజర్, అమెరికాలో డైడాలస్ కార్లు రోజువారీ అవసరాలకు తగిన కార్లుగా స్థానికులను ఆకట్టుకుంటున్నాయి. మన భారత్‌లోను కొన్ని ఆటోమోబైల్ కంపెనీలు ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెడుతున్నాయి.

రైల్ రోడ్

కేవలం ఆకాశ మార్గంలోనే కాదు జల మార్గంలోను సౌరశక్తి వాడకం పెరుగుతోంది. ఇప్పటికే కొన్ని దేశాల్లో పూర్తిగా లేదా పాక్షికంగా సౌరశక్తితో నడిచే టూర్ బోట్లు వచ్చేశాయి. ఓర్హాన్ సిలెలీ అనే రూపకర్త సౌరశక్తిని, నీటి ప్రవాహ శక్తిని గ్రహించి నడిచే ఓ హౌజ్ బోట్‌ను రూపొందించాడు. 2012లో టర్నార్ సోలార్ బోట్ ఏకంగా భూగోళాన్ని 584 రోజుల్లో చుట్టి వచ్చింది. జపాన్‌కు చెందిన టొయోటా మోటార్ కార్పోరేషన్ తమ రవాణా అవసరాలకు సౌరశక్తితో నడిచే నౌకను ఉపయోగించనుందని వార్తలు వచ్చాయి. రైలు మార్గానికి ఈ టెక్నాలజీని అన్వయిస్తున్నారు. ఇటలీలోని పీవీ ట్రైన్ ఆ తరహాదే. యూరోపియన్ యూనియన్ నేతృత్వంలో ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్ విజయవంతమైంది. వస్తు రవాణా కోసం దీన్ని రూపొందించారు. కిస్మారోస్‌లోని కిరాలిరెట్ నారో-గేజ్ రైల్ లైన్, బుడాపెస్ట్‌లోని 'విలీ' రైల్ కార్‌లు అందుబాటులో ఉన్నాయి. 'హీలియో ట్రామ్' జెనీవా, లీన్‌హాసెన్, హానోవర్‌లో తిరుగుతోంది. మన భారతీయ రైల్వేలు కూడా ఎయిర్ కండిషనింగ్ సిస్టమ్, నీటి సరఫరాకు సౌర విద్యుత్ ప్రాజెక్ట్ చేపట్టారు. ఇవే కాకుండా 'పర్సనల్ రాపిడ్ ట్రాన్సిట్' అనే సరికొత్త రవాణా వ్యవస్థకు స్కెచ్ పడింది. మెట్రో ట్రైన్ వంతెనల తరహా నిర్మాణాలపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసి రోప్‌వే మాదిరిగా ప్రయాణీకుల క్యాబిన్‌లు వెళ్లేలా దీన్ని రూపొందించారు. వీటిని జెపాడ్స్‌గా పిలుస్తున్నారు. సుమారు 100 కోట్ల కార్లు ప్రపంచవ్యాప్తంగా రోడ్లపై తిరుగుతున్నాయి. వీటికి ట్రక్కులు, బైకులు, బస్సులు ఇతర వాహనాలు అదనం. వీటి ఇంధన సమస్య తీరిస్తే ఓ పెద్ద సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్టే. ఇప్పటికే కొన్ని ఎలక్ట్రిక్ కార్లతోపాటు పూర్తిగా సౌరశక్తిని వినియోగించే వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో నడిచే 'టిండో' సోలార్ బస్సు పెద్ద విజయం. 42 మంది ప్రయాణీకులను





పెడల్ బోట్

గమ్యాలకు చేర్చగలిగే ఈ బస్సు పూర్తిగా సౌర శక్తిపైనే ఆధారపడి పనిచేస్తుంది. పోర్టా వాట్స్ సోలార్ ట్రక్కును రూపొందించింది. స్విట్జర్లాండ్‌కు చెందిన సోలార్ ట్యాక్సీ కూడా మరో ఆశను చిగురింపజేసింది. 40 దేశాల మీదుగా 18 నెలలపాటు సాగిన దాని ప్రయాణం కొత్త ఒరవడికి నాంది పలికింది. గతేడాది ఫోర్డ్ సీమ్యాక్స్ సోలార్ కారు ప్రదర్శనకు ఉంచారు. ఒక్కసారి చార్జ్ చేస్తే 640 మైళ్ల వరకు వెళ్లగలదని, మార్కెట్‌లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని ఆ సంస్థ పేర్కొంది. ఫ్రాన్స్‌కు చెందిన వెంటురీ సంస్థ రూపొందించిన ఆస్ట్రోల్యాబ్ ఓ ట్రైబ్రిడ్ కారు. కేవలం సౌర శక్తిపైనే ఆధారపడకుండా విండ్ టర్బైన్‌ను కలిగి ఉన్న ఈ మోడల్ చాలా చూడముచ్చటగా ఉండడంతో చాలా మంది ఆసక్తి చూపారు. అటోనామస్ ఆటోస్ వారి సోలార్ కార్లు గంటకు 120 కిలోమీటర్ల వేగాన్ని అందుకున్నాయి. వెంటురీ తయారు చేసిన మరో కారు ఎసెలెక్టిక్ కూడా ఆదరణ పొందింది. ముగ్గురు ప్రయాణించగలిగే ఈ కారుకు టైమ్ మ్యాగజైన్ ఐఫోన్ తర్వాత ఉత్తమ వినూత్న రూపకల్పనగా అవార్డును అందించింది. 'స్టెల్లా' అనే సోలార్ కారు ఫ్యామిలీ కారుగా గుర్తించబడింది. నలుగురు ప్రయాణించే వీలున్న ఈ కారు ఇప్పుడిప్పుడే రోడ్ల మీద కనబడుతోంది. స్టెల్లా లక్స్ అనే కొత్త వేరియెంట్‌ను తీసుకొచ్చారు. ఇంకొన్ని కార్లతోపాటు 'పై' బైకులు, చైనీస్ సోలార్ స్కూటర్లు, సోలార్ ట్రైక్‌లు, సోలార్ క్రూజర్లు అందుబాటులోకి వచ్చేశాయి.

సోలార్ పోటీలు

సోలార్ వాహనాలను ప్రోత్సహించడంలో ఆస్ట్రేలియా అన్ని దేశాల కన్నా ముందుంది. సోలార్ కార్ల పోటీలను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో సత్తా చాటితే అంతర్జాతీయ ఆటో మోబైల్ కంపెనీల చూపును ఇట్టే ఆకట్టుకోవచ్చు. అంతర్జాతీయ విశ్వ విద్యాలయాల నుంచి గ్యారేజీ ఇంజినీర్ల వరకు తమ ప్రతిభ చాటేందుకు ఇక్కడకు వాహనాలతో వచ్చేస్తారు. ఆస్ట్రేలియాలోని డార్విన్ నుంచి ప్రారంభమై ఎడారి మార్గం నుంచీ సాగే ఈ రేసు అడిలైడ్‌లో ముగుస్తుంది. సుమారు 3000 కిలోమీటర్ల దూరాన్ని వేగంగా అధిగమించాలి. 80వ దశకంలో ప్రారంభమైన ఈ పోటీల దార్శనికులు సౌరశక్తి నిపుణులైన హాన్స్ థోల్‌స్ట్రప్, ల్యారీ పెర్కిన్స్‌లు. ఐదారు రోజుల పాటు ఈ రేసును నిర్వహిస్తున్నారు. చివరిసారి 2013 రేసులో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం రూపొందించిన 'ఈవా' కారు విజయవంతంగా రేసును ముగించింది. ఫ్యామిలీ సోలార్ కారుగా గుర్తింపు పొందిన 'స్టెల్లా' కూడా ఈ పోటీల్లో తళుక్కుమన్నదే. ఈ ఏడాది అక్టోబర్‌లో ఈ రేసును నిర్వహించనున్నారు. మనదేశం నుంచి తొలిసారిగా బెంగళూర్ ఆర్వీసీఈ కళాశాల విద్యార్థులు పాల్గొంటున్నారు. వీరి మోడల్ 'సోల్ బ్లేజ్' నిపుణుల ప్రశంసల్ని అందుకుంది. దక్షిణాఫ్రికా, అమెరికా, జపాన్ టోకై విశ్వవిద్యాలయం, డచ్ గ్లోబల్ గ్రీన్ చాలెంజ్, బ్రిడ్జర్‌స్టోన్ కార్ల రేసులే కాక కాక ఫ్రిసియన్ బోట్ రేసు కూడా సోలార్ వాహనాల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నవే. అనేక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో కూడా ఈ పోటీలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి.

చక్రం తిప్పేవి..

సోలార్ టెక్నాలజీకి బ్రేక్‌లు వేస్తున్న నిల్వ, పరిధి, ఖర్చు, కాంతి లేమి సమస్యల్ని పరిష్కరిం చేందుకు ముమ్మరంగా పరిశోధనలు జరుగుతున్నాయి. టొరొంటో విశ్వవిద్యా లయం 'కొల్లాయిడల్ క్వాంటం డాట్స్' అనే లైట్ సెన్సిటివ్ నానో

కొన్ని నిజాలు...

- **ఇ**ప్పటి అవసరాలకు ఏటా 1100 కోట్ల టన్నుల క్రూడాయిల్‌ను మింగేస్తున్నాం. మరో 20 ఏళ్లలో ఈ అవసరం రెట్టింపు అవుతుందని అంచనా. కానీ అప్పటికి లభ్యమయ్యేది కేవలం 400 కోట్ల టన్నులే.
- **ప**గటిపూట 9000 అడుగుల ఎత్తులో రాత్రిపూట 1000 అడుగుల ఎత్తులో విహరించే వాయువాహన ప్రయోగం విజయవంతం కావడంతో పరిశోధకుల్లో తాజా అంచనాలు పెరిగిపోయాయి. దానికి 'పెరల్' అని పేరు పెట్టారు. ఫిష్షింగ్ బాబర్ స్ఫూర్తితో దీన్ని గోళాకారంలో తయారుచేశారు. ఇదీ మంచి ఫలితాల్ని అందించింది.
- **న్యూ**జిలాండ్ ఇంజినీర్లు రూపొందించిన ఈటిండో బస్సు ఒకసారి చార్జ్ అయితే 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించ గలదు.
- **'జీ**బ్రా' సోలార్ బ్యాటరీలతో ఒక చార్జ్‌కు 400 కిలో మీటర్ల దూరం ప్రయాణించిన సోలార్ ట్యాక్సీ 90 కిలో మీటర్ల వేగంతో వెళ్లగలదు. లూయిస్ పామర్ రూపకల్పన అయిన ఇది చాల తక్కువ ఖర్చుతోనే రూపొందించబడింది.
- **ఎ**నిమిదేళ్ల తీవ్ర కృషితో మొత్తం 60 మంది విద్యార్థుల భాగస్వామ్యంతో ఈవా కారు ప్రాజెక్టు అంచనాల్ని అధిగమించింది. అంతరిక్ష స్థాయి గాలియం ఆర్సినైడ్ సౌర ఫలకాలు, తక్కువ బరువున్న లిథియం అయాన్ ఘటాల వల్ల ఇది సాధ్యమైందని ఈవా ఇంజనీర్లు తెలి పారు.
- **సో**లార్ ఇంపల్స్ విమానాన్ని స్విట్జర్లాండ్‌కు చెందిన లాస్సనే పాలిటెక్నిక్ ఎకొలే సంస్థ రూపొందించింది. అమెరికాలోని సాన్ ఫ్రాన్సిస్కో నుంచి న్యూయార్క్ సిటీ వరకు కేవలం సౌర శక్తినే ఉపయోగించి రెండు నెలల ప్రయాణం చేసిందీ విహంగం. పగలు స్వీకరించిన సూర్యశక్తిని నిల్వ చేసుకుని రాత్రుళ్ల కూడా ప్రయాణిం చడం దీని ప్రత్యేకత. వీళ్లే ఇంపల్స్-2ను పరీక్షించారు.
- **వె**నెడియం పీఈసీ ద్వారా రివర్సిబుల్ ఎలక్ట్రాన్ స్టోరేజీ విధానంలో ఇది పనిచేస్తుంది. అధిక మొత్తంలో ఉత్పత్తికి అనుకూలంగా ఉండే మెగ్నీషియం క్లోరైడ్ పలుచటి ఫిల్మ్‌ను టెల్యూరైడ్ కోటింగ్ విధానాన్ని కనుగొన్నారు.

పార్టికల్స్‌ను రూపొందించింది. దీని వల్ల తక్కువ ధరకు, ఎక్కువ ఫ్లెక్సిబుల్‌గా ఉన్న సౌర ఫలకాలను తయారు చేయొచ్చు. లండన్ ఇంపీరియల్ కాలేజీ విద్యార్థులు మూడు రెట్ల మెరుగైన గాలియం ఆర్సినైడ్ సౌర ఫలకాలను తయారు చేశారు. జపాన్ వేడినీటి ఊటల్లో ఓ బ్యాక్టీరియాను జర్మనీ శాస్త్రవేత్తల బృందం గుర్తించింది. ఉష్ణ శక్తిని అమితంగా వాడుతున్న ఈ బ్యాక్టీరియా ద్వారా జీవాధారిత సౌర ఫలకాలను రూపొందించేందుకు అవకాశముందని వారు ప్రకటించారు. షెఫ్ఫీల్డ్ పరిశోధకులు మరో అడుగు ముందుకు వేసి పెర్వోస్కైట్ స్ప్రే ద్వారా తక్షణం సౌర ఫలకాలను తయారు చేసే సాంకేతికతను అభివృద్ధి చేశారు. దేన్నైనా సౌర ఫలకంగా మార్చే ఈ స్ప్రే సంచలనం సృష్టిస్తోంది. ఐబీఎం రూపొందించిన కాన్సన్‌ట్రేటెడ్ ఫొటో వోల్టాయిక్ సెల్స్‌తో పాటు ఆప్టికల్ యాంటెన్నాలు, సిలిండ్రిక్ షేప్, ప్లాస్టిక్ సెల్స్, పాలిమర్ స్టిక్కర్, నానోనెట్ స్నేర్, సూపర్ హైడ్రోఫోనిక్ గ్లాస్ కోటింగ్, బ్లాక్ సిలికాన్, కనెక్టింగ్ గ్లూ, కార్బన్ నానో ట్యూబ్స్ వంటివి సోలార్ సెల్స్ సామర్థ్యాన్ని పెంచనున్నాయి. నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా నోవాటెక్ సోలార్ సంస్థ 'మోల్టెన్ సాల్ట్' స్టోరేజీ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఓహియో జాతీయ విశ్వవిద్యాలయం సోలార్ ప్యానెల్‌కే ఉన్న బిల్ట్ ఇన్ బ్యాటరీని రూపొందించింది. ఇది 25 శాతం మెరుగైంది, చవకైంది. టెక్సాస్ విశ్వవిద్యాలయం 'డార్క్' పేరిట రాత్రుళ్లు కూడా శక్తినందించే సౌర ఘటాన్ని ఆవిష్కరించారు. పునరుపయోగానికి పనికి వచ్చేలా వృక్షాధారిత సౌర ఫలకాలను తయారు చేస్తున్నారు జార్జియా ఐటీ, పర్డ్యూ విశ్వవిద్యాలయం నిపుణులు. మొక్కల్లోని సెల్యూలోజ్ నానో క్రిస్టల్ సబ్‌స్ట్రేట్‌లను నీటిలో నానబెట్టి వాటిని తిరిగి ఉపయోగించు కోవ చ్చని నిరూపించారు. నెదర్లాండ్స్‌లో సోలార్ రహదారులను నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్ప టి పెట్రోల్ బంకుల్లా వాహనాలను రీచార్జ్ చేసే సోలార్ బంకుల రూపకల్పనకు మోడళ్లు రూపొందించారు.

ఈ పరిశోధన ఫలాల్ని సరిగ్గా వినియోగిస్తూ అంతర్జాతీయ స్థాయి ఆటోమొబైల్ కేంద్రాల నుంచి మరెన్నో గ్యారేజీల్లోను ఉత్తమ సోలార్ వాహన రూపకల్పనకు స్కెచ్‌లు సిద్ధమై సామాన్యుడికి అందుబాటులోకి తెచ్చేందుకు విరామం లేకుండా కృషి చేస్తున్నారు. కొన్ని సోలార్ వాహనాలు మరో ఐదు, పదేళ్లలో అందుబాటులోకి రానున్నాయని వార్తలు. థైసెన్‌క్రప్ సన్‌రైజర్, చెవీ ఎరా వంటి లగ్జరీ కార్ల నుంచి సోలార్ బగ్, స్టెల్లా లక్స్ వంటి ఫ్యామిలీ కార్లు మరిన్ని హంగులతో వీధుల్లో తిరగనున్నాయి. మనదేశ ఆటోమొబైల్ పరిశ్రమల కార్లు సత్తా చాటి ప్రపంచం దృష్టిని ఆకర్షించనున్నాయి. స్టీవ్ బ్రైటస్ అనే గ్యారేజీ టింకరర్ రూపొందించిన 'సోలార్ బగ్' చర్చనీయాంశమైంది. చాలా తక్కువ ఖర్చుతో తయారుచేసిన ఆ కారు నగర అవసరాలకు చక్కగా సరిపోతుంది. ఆ కారుకు స్థానికంగా మద్దతు లభించి ఆర్డర్లు వచ్చాయి. ఇలాంటి గ్యారేజీల్లోనే అద్భుతాలు సంభవిస్తాయని పరిశోధకులు ఊహిస్తున్నారు. ఏమో ఏ మెకానిక్ గ్యారేజీలోనో, విద్యార్థుల వర్క్‌షాప్‌లోనో సౌరశక్తి వాహనాల గతిని మార్చే ఆవిష్కరణ ప్రాణం పోసుకోవచ్చు. వాయు వేగంతో ప్రపంచాన్ని చుట్టి రోడ్లను కళకళలాడించవచ్చు. సౌరశక్తి పంట పండించి ఈ ఆయిల్ యుగానికి భూమిలో చమురుండగానే అంతమొందించొచ్చు. అప్పుడు శాస్త్రవేత్తల బుర్రలకు మరో పని కల్పించొచ్చేమో.

- జేయస్పీ

9502395077

శక్తి సూత్రమిదే

ఒకటిన్నర శతాబ్దాల క్రితమే సౌర శక్తిని విద్యుత్ శక్తిగా మార్చే సూత్రాన్ని చార్లెస్ ఎడ్గార్ ఫ్రిట్స్ అనే మేధావి 1883లోనే కనుగొన్నాడు. న్యూయార్క్ సిటీకి చెందిన ఎలక్ట్రీషియన్ అయిన చార్లెస్ సెలేనియం అనే సెమీ కండక్టర్‌కు పలుచని బంగారు తాపడం వేసి గాజు ఫలకాన్ని అమర్చి తొలి సౌర ఫలకాన్ని రూపొందించాడు. ప్రపంచం ఉచితంగా వాడటం కోసం పేటెంట్ కూడా తీసుకోలేదు. ఆ ఫలకానికే మరిన్ని మార్పు చేర్పులు చేస్తూ వేలాది మంది శాస్త్రవేత్తలు చవకైన ఇంధనాన్ని అందించే పనిలో ఉన్నారు. సౌరశక్తి యంత్ర సూత్రమిదే.. కాంతి సౌర ఫలకాల మీద ప్రసరిస్తుంది. కాంతి ఫోటాన్‌లనే చిన్న చిన్న కణాలను ప్యాకెట్ల రూపంలో కలిగి ఉంటుంది. ఈ ఫోటాన్‌లు ఫలకాల్లోని సిలికాన్ వంటి సెమీ కండక్టర్ అణువుల మీది ఎలక్ట్రాన్‌లను బంధం నుంచి విముక్తి చేస్తాయి. ఆ ఎలక్ట్రాన్‌లు ఒకే మార్గంలో, దిశలో ప్రవహించడంతో విద్యుత్ శక్తిగా మారుతుంది. ఇలా ఉత్పత్తి అయినా విద్యుత్ శక్తిని యాంత్రిక శక్తిగా మార్చి వాహనాలకు ఉపయోగిస్తారు. దీనిలో కాంతి శక్తి విద్యుత్ శక్తిగా, యాంత్రిక శక్తిగా నేరుగా మారడం వల్ల కాలుష్యం అనే సమస్యే ఉండదు. ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న గ్లోబల్ వార్మింగ్‌కు చెక్ పెట్టగల శక్తి సౌరశక్తి ఇంధనానికి ఉంది.

మన సూరీడు

భారత్‌లో బ్లేజ్‌వాడలు, సన్ సిటీలు, భానుడి గ్రామాలు ఎక్కువ. గ్లోబల్ వార్మింగ్ పుణ్యమాని వానాకాలానికి ఎండాకాలానికి తేడా లేకుండా ఏడాదిలో ముప్పావు వంతు కాలం రవికే అంకితమైపోతోంది. ఇదే సౌరశక్తి ఇంధనానికి అపారమైన అవకాశాల్ని కల్పిస్తోంది. రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఆటో రిక్షాలకు సౌర ఘటాలను వాడేస్తున్నారు. 2004లో జేమ్స్ మోస్ అనే ఆయన ఉదయ్‌పూర్‌లో తొలి సోలార్ ట్యాక్సీని పరిచయం చేశాడు. సోలార్ బజాజ్ ఆటోలు దర్శనమిస్తున్నాయి. ఇవే కాక 'హార్వెస్ట్ ఎనర్జీ' వారి పెడల్, సూరత్‌లోని సోలార్ ఆటో రిక్షాలతో పాటు సోలార్ గోల్ఫ్ కార్లు రంగప్రవేశం చేశాయి. ఢిల్లీ సాంకేతిక విశ్వవిద్యాలయం విద్యార్థులు 'సోలారిస్ అర్క' పేరిట సోలార్ వాహనాన్ని అభివృద్ధి చేస్తున్నారు. మణిపాల్ విశ్వవిద్యాలయం విద్యార్థులు రూపొందించిన సోలార్ కారు గంటకు 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకుని ఒక్క చార్జ్‌పై 150 కిలోమీటర్ల దూరం ప్రయాణం సాగించగలదు. సోలార్ మొబిల్ మణిపాల్‌గా పిలుస్తోన్న ఈ కారు భారత్‌కు చెందిన తొలి సోలార్ కారుగా గుర్తించబడింది. గతేడాది ఇండియన్ ఇన్నోవేషన్ అవార్డ్స్‌లో మూడో స్థానం సాధించింది. సౌర ఇంధనాన్ని నిల్వ చేసుకుని రాత్రుళ్లు కూడా నడవడం దీని ప్రత్యేకత.

ప్రేమ పొత్తిళ్లలోకి...!

- పట్నాయకుని వెంకటేశ్వరరావు

◆ **కథ**

వాచ్‌మన్.... ఏంటాగోల... అబ్బబ్బ డిస్టర్బెన్స్.. కామెన్‌సెన్స్ లేదు. కల్చర్ లేని వాళ్లతో కలిసి ఉంటే ఇంతే. అనవసరంగా ఇక్కడ కొన్నాను. లాభం లేదు. చందానగర్‌లో గేటెడ్ కమ్యూనిటీ ఫ్లాట్ చూసుకోవాలి. డ్యూటీకి బయలుదేరుతూ విసునక్కుంటున్నాడు.. 204లోని శంకర్రావు. అదిరిపడుతూ వాచ్‌మన్ వరాలు వచ్చాడు. సార్ పిలిచినట్టు న్నారు.... అదేనయ్యా... ఏంటీ ఉదయంనుంచీ ఆ గోల.. వెళ్లి వారికి చెప్పు తలుపులేసుకోమని. ఏంటీ అపార్ట్‌మెంట్లో ఎవరూ ఉండ క్కర్లేదా.. ఇలాగైతే అసోసి యేషన్ వాళ్లకి చెప్పు. మెయిం టెనెన్స్ కట్ చేస్తామని... వరాలు నుంచి సమాధానం ఆశించకుండానే విరుచుకుపడుతున్నాడు. వరాలు మెల్లిగా గొంతు సవరించుకొని సార్... 207లో అని చెప్పబోతుండగా.. ఎక్కడైతే ఏమిటయ్యా... ఎక్కడనుంచో వచ్చేస్తారు. అద్దెకున్నోళ్లో తెలీదు.. ఓనర్లో తెలీదు.. ఓనర్లే సార్... అపార్ట్‌మెంట్ కట్టించిన దగ్గరనుంచీ ఉంటున్నారు. అని చెప్తున్నా.. శంకర్రావు ఆగడంలేదు. ఏమిటో రూల్స్ తెలీనోళ్లంతా ఫ్లాట్‌లు కొనేయడమే... ఏదో నాలుగు డబ్బులు పోగేసుకొని... ఈ బ్యాంకులు ఒకటీ తగలబడ్డాయి అందరికీ అప్పులిచ్చేయడమే.. ఏ సాఫ్ట్‌వేరో అయితే కల్చర్ తెలుస్తుంది. అంటూ తన ధోరణిలో... విరుచుకు పడుతున్నాడు...

అక్కడంతా ఫ్లాట్‌లు కొని ఎనిమిదేళ్లవు తున్నా ఎవరెవరో ఎవరికీ తెలీదు. అందరికీ తెల్సిం దల్లా 106, 109, 420 లాంటి నెంబర్లే. అందరికీ వాచ్‌మన్



సంధానకర్త.. ఏది చెప్పాలన్నా రాజరి కపు దర్పంతో కేకలే స్తారు. ఇక అసోసి యేషన్.. అదో బ్రహ్మప దార్థం ఎవరు నిర్వహిస్తు న్నారో... తెలీదు. అందరికీ తెల్సిందల్లా నెలలో ఏదోరోజు మెంటెనెన్స్ ఇవ్వడం. బాత్‌రూంలో కుళాయి మొరాయించినా, నాలుగడుగుల కారిడార్‌లో ఓ కుర్చీ ఎగస్ట్రా ఉన్నా... వాచ్‌మన్ మీద విరుచుకుపడడం. అవసరానికి పక్కింట్లో గొంతు చించుకున్నా పలికేవాడుండడు. పొరపాటున ఏ అవసరంపడి ఎదురింటి కాలింగ్ బెల్‌కొడితే తలుపు సందులోనుంచే చెప్పిచ్చుకు కొట్టినట్లు ఫటేల్‌మని సమాధానం చెప్పి ధాం అని తలుపేసి జీవితంలో మరలా ఆ ఇంటివైపు చూడొద్దని సందేశం ఇవ్వడమే అక్కడున్న వారికి తెలుసు. వారికి అవసరం పడితే మాత్రం నిర్మొహమాటంగా ఏ ఇంటి బెల్‌నొక్కయినా అడిగి తీసుకెళ్లడం.. ఎంతో సోషల్‌గా ఉంటామన్నట్లు బిల్డప్ ఇవ్వడం వారికి అబ్బిన కల్చర్. అపార్ట్‌మెంట్ పేరు 'ప్రేమ సదన్' అదీ బిల్డర్ తన కూతురు మీద ప్రేమతో పెట్టుకుంది. కానీ అక్కడంతా పేరుకు

భిన్నం.

వరాలుకు కొత్తలో ఇదంతా వింతగా ఉండేది. పొట్ట చేతపట్టుకొని శ్రీకాకుళం జిల్లాలోని ఓ మారుమూల గ్రామం కాపుగోదేవలస నుంచి వచ్చాడు. ఊర్లో వృత్తిచేసుకొని తండ్రి సిమ్మయ్య గడిపాడు. అంతా ఒరే సిమ్మిగా అని పిలిచినా అందులోన అనురాగం ఉండేది. ఉండే 200 గడపల్లో పేరుకే వేర్వేరు ఇల్లు. ఊరంతా ఉదయం కోడికూసిన దగ్గర్నుంచీ పొదుగుంకే వరకూ కలిసే ఉండేవారు. సాయంత్రం ఇళ్లకొచ్చినా నాలుగు ముద్దలు మింగాక వీధి అరుగుల్లోనో... ఆరుబయటే మంచాలేసుకొని ప్రపంచాన్ని వడబోసేవారు. తెల్లవారి ఎర్ర చెరువుగట్టు దగ్గర ఎలుగుబంట్లు సీన్ దగ్గరనుంచి సంతబొమ్మాళి బజారులో చేపల ధరల వరకూ సమీక్షలు జరిగేవి. జియ్యన్నపేట హరిహరరావు, కోటబొమ్మాళి దుక్కరాములు మధ్య నలుగుతున్న రాజకీయ పోరును సొండి రామ్మూర్తి రసవత్తరంగా చెప్తుంటే అందరూ నోరెళ్ల బెట్టి వినేవారు. మధ్యలో సిమ్మయ్య భాగోతంలోని పదాలు పాడి ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చేవాడు. అప్పుడు తండ్రి ఒడిలో కూర్చొని సుప్పో, సేగుడెమో తినుకుంటూ వరాలు అలా వింటూనే నిద్రలోకి జారిపోయేవాడు. ఇదంతా మంచాలతమీద నుంచే చూస్తేన్న ఆడోళ్లు... ఒరె పిల్లోడు తొంగుండి పోనాడు.. ఇంకెల్లురా.. నీ మాటకేంగాని ఆడికైనా సదివించురా' అని గట్టిగా గదమాయించే వరకూ సిమ్మయ్య ఈ లోకంలోకి వచ్చేవాడు కాదు. అప్పుడు భుజంమీద కటకాం (కటక్ నుంచి కొన్నది) తువ్వాలు సర్దుకొని 'ఒరే బావు లేయెస్ ఇంటికెళ్లి తొంగుందమా... పెందిలికాడ రేవుకెళ్లాల' అప్పా వస్తానే అని లేచి కొడుకును భుజానకెత్తుకొని మురిసిపోయే వాడు. మా నాయన గడ్డిగాడు ఈ ఊరుని నమ్ముకొని ఏ లోటూ లేకుండా బతికేనాడు. నాను, ముదరదాయి ఈ ఇర్తిలోనే గంజో గడుగో తాగి పిల్లల్ని సాకుతున్నాం. ఇదిగో ఇద్దరు ఆడపిల్లల తర్వా ఈడు పుట్టాడు. ఈడికి ఎలాగైనా సదువుబరికి పంపాల. సంతబొమ్మాళి జోగారావు పంతులు దగ్గరకెళ్లి ముహూర్తం అడగాల. అని తనలోనే అనుకుంటూ లేచేవోడు.

ఇలాంటి బాల్యం ఒక్కసారి వరాలు కళ్లెదుట కదిలింది. తండ్రి అనుకున్నట్లు చదువు అబ్బలేదుకానీ, అంగోళ్ళ శాంతారావు, సాన తూటిగాడులా తనూ గళ్ల లుంగీ కట్టుకొని, గీరల చొక్కా ఏసుకొని తిరగాలని కలలు కనేవాడు. పెద్దయ్యాక తుంగాం దగ్గర బంధువుల పిల్ల రెయ్యమ్మకిచ్చి పెళ్లి చేశారు. సిమ్మయ్య ఇన్నాళ్లలాగ వృత్తి చేయలేకపోతున్నాడు. వరాలుకూ దానిమీద ఆసక్తి లేదు. కానీ కోటబొమ్మాళి వెళ్లి రంగడు దగ్గర ఇస్త్రీ నేర్చుకున్నాడు. ఊర్లో అంతా ఒరేయ్... అని పిలిస్తే అదోలా ఉండేది. ఇళ్లకు వెళ్లి బట్టలడిగి రేవుకెళ్లడం, ఏడాదికోమారు కొలిచిన ధాన్యం మోసుకొచ్చి ఇంట్లో వేయడం, పంగడప్పుడు దండుకోవడం, వృత్తి పనిలేనప్పుడు వ్యవసాయం పనులకెళ్లడం చిరాకెత్తినా సర్దుకు పోయేవోడు. ఎంతైనా పుట్టి పెరిగిన ఊరొదిలి ఎక్కడికెళ్తాం. అనుకునేవాడు. శివరాంపురం నుంచి హైదరాబాద్ వెళ్లిన అతని బావ కుటుంబం దర్జాగా ఉందని తెలిసినప్పుడల్లా... రెయ్యమ్మ ఇంట్లో పంచాంగం ఇప్పేది. అక్కచెల్లెలు వచ్చినప్పుడల్లా ఒరన్నా ఇదరా అల్లుడికి ఉసమాన్ బిసకత్తు అని తెచ్చి ఇచ్చినప్పుడు తన భార్య చూసే చూపులు ములుకుల్లా గుచ్చుకున్నేవి... తన మేనల్లుడు, మేనకోడలు వేసుకుంటున్న బట్టలు చూసి పిల్లలు ముచ్చటపడితే కొంచెం తడబడేవోడు. ఇక అక్కచెల్లెలి చీరకట్టు... బావ వేసుకున్న జీన్ ఫ్యాంట్ వారి మాట చూశాక ఎక్కడో చివుక్కుమనేది. ఒరన్న అనే చెల్లి అన్నయ్యా.. అంటుంటే కొత్తగా ఉన్న భలే ఉందే అనుకునేవాడు. రెయ్యమ్మకైతే కుతకుతలాడేది. ఆడపడుచు వెళ్లిపోయాక 'నువ్వూ ఉన్నావ్ ముండ మగోడివి... ఇక్కడే ఇనాగా మట్టైపోదుంలే. అని ఈసడించేది. ఇక తట్టుకోలేక ఓ రోజు బావని ఆశ్రయించి... ఏడేళ్ల కిందట భాగ్యనగరం బాట పట్టాడు.

నగరవాసిగా మారాడు. ఇక ఒరేయ్... గిరేయ్ పిలుపుల్లేవు. అంతా వాచ్‌మన్ అంటూంటే మురిసిపోయేవాడు. కానీ ఒక్కోమారు తన పేరు తనకే గుర్తుకు వచ్చేదికాదు. అంతా చిత్రంగా ఉన్నా అలవాటు పడ్డాడు. వేషం మారింది. నెలకు ఎలా లేదన్నా... ఓ పదివేలు కిడుతుంది. రెయ్యమ్మ రూపమే మారిపోయింది. పేరూ రాణమ్మ అయింది. ఏంటయ్యా... వింటున్నావా... అని శంకర్రావు మరలా గద్దించేసరికి ఈ లోకంలోకి వచ్చాడు. ఈలోపు 207లో సుశీలమ్మ గొంతు వినిపిస్తోంది. 'ఇంతలోనే అన్యాయం చేశావయ్యా... నిన్నటినిన్న తీర్థయాత్రలకని టికెట్లు బుక్‌చేశావు కదయ్యా... ఈ వయస్సులో ఏటయ్యా ఈ బాధ... అని గుండెలవిశేలా రోదిస్తోంది.' అది ఎవరినీ కదపలేదు సరికదా.. అసలేంటని ఆరా తీసేవారే లేరు. చివరికి వరాలే.. శంకర్రావును పక్కనపెట్టి అక్కడకు పరుగెత్తాడు. చిర్రెత్తిపోతూ శంకర్రావు నిద్రలో ఉన్న భార్య రమ, కొడుకు చింటూలకు డిస్టర్బెన్స్ లేకుండా డోర్ దగ్గరకేసుకొని షిఫ్ట్ డ్యూటీకి పరుగెత్తాడు. ఆ రోలో ఆరు ఫ్లాట్లున్నా ఎవరూ ఇంకా మేలుకోలేదు. ఇంట్లో ఉన్నా రనడానికి సింబల్‌గా పాలపేకట్లు, పేపర్లు వారివారి ఫ్లాట్ల ఎదుట పడి ఉన్నాయంతే.

207 దగ్గరకు వెళ్లిన వరాలుకు నోట మాట రాలేదు. అందులో ఉండేది భార్యా, భర్తలే. కొడుకు కిశోర్ అమెరికాలో ఉంటున్నాడు. కూతురు విశాఖలో. పరంధామయ్య రిటైర్డ్ తహశీల్దార్. కొడుకునూ, కూతురిని సెటిల్‌చేశాక ఈ అపార్ట్‌మెంట్‌లో భార్యతో ఉంటున్నాడు. ఎప్పుడైనా మనములు, మనవరాళ్లు వస్తేనే సందడి. లేకుంటే వృద్ధ దంపతులే ఒకరికొకరు తోడు... నీడ. అందుకే ఇద్దరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటారు. ఒకరికొకరు కావాలి కాబట్టి. చుట్టూ ఉన్నా ఎవరూ పట్టించుకోరు కాబట్టి. వాచ్‌మన్‌కు మాత్రం వారంటే కాస్త గౌరవం. పండగకూ, పబ్బాలకూ సుశీలమ్మ... నోరారా పిలిచి ఇంట్లో వంటకాలు పెట్టేది. పెద్దాయన కూడా అడపా తడపా వరాలును ఓ కంట కనిపెట్టేవాడు. అలాంటి పరంధామయ్య నిర్జీవంగా పడి ఉండేసరికి వాచ్‌మన్‌కు గుండె ఆగినంత పనైంది. ఆ పెద్దామెను ఓదార్చేదెవరు... అసలు అక్కడకు ఎవరొస్తేగా... ఎవరూ తలుపులే తీయలేదు. ఏదో జరిగిందని తెలిసినా శంకర్రావు... పట్టనట్టు వెళ్లిపోయాడు... వరాలు వెంటనే ప్రెసిడెంట్ దగ్గరికి పరుగెత్తాడు. ఆయన లేడని ఇంట్లో సెల్ నెంబర్ ఇచ్చారు. అది నాట్‌రీచబుల్ వస్తోంది. మిగతా ఫ్లాట్‌ల్లో ఎవరన్నా ఉన్నారా అని అన్ని ఫ్లోర్‌లూ వెతికాడు. భార్యనూ... పైకి పంపి సుశీలమ్మ దగ్గర ఉండమన్నాడు. మెయింటెనెన్స్ రిజిస్టర్‌లోని నెంబర్లను బట్టి ఓ నాలుగు నెంబర్లకు కొట్టాడు. చివరికి సెక్రటరీ లైన్లోకి వచ్చాడు... సార్... అని విషయం చెబుతుండగానే అవుటాఫ్ కవరేజి ఏరియా వచ్చింది. రాణమ్మ హడావుడితో ఇతర ఫ్లాట్‌లవారు బయటకు వచ్చారు. అంతా ఏమైందని ఆమెనడిగి.. ఓహో అలానా... వాచ్‌మన్ ఏడీ... వాటర్ ఏశారా.. అసోసియేషన్ వాళ్లకు చెప్పారా... అనేవారే తప్పా సుశీలమ్మను పలుకరించినవారు లేరు. మూడడుగుల దూరంలోనే ఉన్న ఓ మనిషి ఈ లోకానికి శాశ్వతంగా సెలవుతీసుకున్నాడని తెలిసినా ముందుకు వచ్చి నిలిచిన వారు లేరు. రాణమ్మకూ ఆ స్థితి నచ్చలేదు. ఇదే తమ ఊళ్లలోనైతేనా గుడ్లనీరు కక్కుంటూ పరుగున వచ్చి వాలరూ. నాలుగు రాగాలు తీసి అనుబంధాన్ని పంచరూ.. ఛీ..ఛీ సదువుకున్నోలట ఇదేం బతుకులు... అని లోలోన అనుకుంది. అంతా ఉండీ అనాథలంటే ఇదే మరి అనుకుంది. పాపం ఆ పెద్దామె భర్త శవం వద్ద కుమిలి కుమిలి రోదిస్తోంది. మరోవైపు కొడుకుకు ఫోన్లు కొడుతూనే ఉంది. కుమార్తెకు విషయం తెలిసి బయలుదేరి వస్తున్నానని చెప్పింది. అంతవరకూ తల్లిని చూసుకోమని ఎవరికైనా చెప్పాలనుకుంటే అక్కడెవరూ ఉంటేగా ఒక్క రాణమ్మ తప్పా.

వరాలు శ్రమ ఫలించి సెక్రటరీ లైన్‌లోకి వచ్చాడు. విషయం చెప్పాడు. సరే..సరే బాడీ ఎంతసేపు ఉంచుతారో అడుగు. అపార్ట్‌మెంట్‌లో అందరికీ సమాధానం చెప్పుకోవాలి. అటు మనిషిపోయాడన్న బాధకంటే తన బాధ్యతలు ముఖ్యమనుకున్నాడతను. ఇంతలోనే మిగతావారు బయటకు వచ్చారు. ముసలాయన పోయాడట... ప్చ్ ఏం చేస్తాం. ఎప్పటికి ఎవరికి ఎలా రాసి ఉంటుందోనని మెట్టవేదాంతం ఒలక బోశారు కొందరు. అందరూ ఆఫీసులకు వెళ్లే వేళవుతోంది.

ఎప్పటికి వస్తారో వీరి మనుషులు.. విసుక్కుంటోంది.. ఒకామే. కొందరైతే ఎంచక్కా ఇయర్‌ఫోన్‌లు బిగించుకొని తమలోకంలో హడావుడిగా ఫ్లాట్‌ల నుంచి బయటపడుతున్నారు తప్పా.. పొరపాటున కూడా అక్కడేమి జరుగుతుందోనన్న ధ్యాస లేదు వారికి. చివరికి రాణమ్మే టీ కాసి తెచ్చి సుశీలమ్మకు తాగించే ప్రయత్నం చేసింది. వరాలు కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. ఎవరికి చెప్పాలి... ఏం చేయాలి. 'అమ్మా.. పాపా వాళ్లకి ఫోన్ చేయనా అని అడిగాడు..... కొడుకుకు సమాచారం ఇచ్చారా అని ఆరా తీశాడు. కాసేపటికి కూతురు నుంచి ఫోన్.... 'అమ్మా.. ఆయన రాలేరట. నేనే ఏదో పాట్లు పడి వస్తాను. అన్నయ్య సంగతేంటి.. ఆరా తీసింది. అక్కడినుంచే ల్యాప్‌టాప్ కెమేరాలో చూసి నాన్నకు ఏలోటూ రాకుండా అంత్యక్రియలు చేయమని చెప్పి నాన్న దీనికోసమే దాచిన బ్యాంక్ బ్యాలన్స్‌న గుర్తు చేశాడమ్మా' అంటూ వణికే గొంతుకతో సుశీలమ్మ సమాధానం. ఈ సంభాషణ విన్న వరాలుకు పల్లె గుర్తుకొచ్చింది. ఇలా మనిషి పోతేనా... అన్ని పనులూ వదిలి జనం రాకూ కాట.. పనులు అయ్యే దాకా కూడు తినకుండా తలో పని పంచుకోరు. చెట్టుకొట్టేదొకరు, బొమ్మాళి పాడి సామన్లుకు ఒకరు... ఎవరూ చెప్పకుండానే... ఎవరి బాధ్యతలు ఆళ్లు తలకెత్తుకుంతారు. ఇదేం బతుకులు.... చివరికి ఉన్న ఆయమ్మను కూడా ఈళ్లు బతకనిచ్చేటట్లు లేదనుకున్నాడు.' ఆమాటే అనేశ్వాడు... ఇంక ఉండబట్టలేకపోయాడు. పక్కనున్న వాచ్‌మన్ జహంగీర్‌ను పిలిచాడు. వచ్చిన దగ్గర నుంచీ అతనితెనే మనసు విప్పి మాట్లడే చనువు వరాలుకు ఉండేది. ఆ చనువుతోనే విషయం చెప్పి ఇక ఈళ్లింతే మనమే ఏదో ఒకటి చేద్దామని చెప్పాడు... ఇద్దరూ సుశీలమ్మ దగ్గరికెళ్ళి... 'అమ్మా మేం నీకొడుకుల్లాంటోళ్లం... అనడంతో ఆమె గుండె చెరువైంది. హృదయం బద్ధలైంది. అన్నీ మరిచి వరాలును పట్టుకొని గుండెలవిశేలా రోదించింది. అప్పటిదాకా మౌనంగా ఉన్న రాణమ్మ గుండే పగిలింది. వారే కూతురూ, కొడుకూ అయ్యారు... వారి మనుషులో మరో నలుగురు వచ్చారు... అంతా కలిసి 'పరంధామయ్యను' సాగనంపారు. చివరికి వరాలే... పెద్దాయనను పంచభూతాల్లో కలిపేశాడు.... 'అప్పుడప్పుడూ తన కష్టసుఖాలు పంచుకునే మనిషిని తానే ఇలా కొడుకై బాధ్యత నిర్వహిస్తాడని ఏనాడూ అనుకోలేదు. సాయంత్రం... ఫ్లాట్ ఓనర్లంతా సమావేశమయ్యారున. ఇకముందు వృద్ధులకు ఫ్లాట్‌లు అమ్మరాదనీ, కొన్నవారిని హెచ్చరించాలని తీర్మానించారు. అపార్ట్‌మెంట్లలో ఇలాంటి న్యూసెన్స్ వల్ల అందరికీ డిస్టర్బన్స్ అయితే ఊరుకో కూడదని సమిష్టి నిర్ణయంగా ప్రకటించారు...

రెండో రోజూ ఉదయం కుమార్తె వచ్చింది. విషయం తెలుసుకొని నాలుగు కన్నీటిబొట్లు రాల్చింది. డిగ్నిటీకి భంగం కాని విధంగా... ఇంతలోనే ప్రెసిడెంట్, సెక్రటరీ వచ్చారు. పేరుకు పలకరింతేనా.... అసలు కథ అసోసియేషన్ నిర్ణయం చెప్పడానికి... అంటే ఇన్‌డైరెక్ట్‌గా సుశీలమ్మనూ అక్కడి నుంచి తీసుకెనళ్లి పొమ్మనీ... ఉదారంగా తాము ఫ్లాట్‌కు బేరం చూస్తామని భరోసా ఇచ్చారు. పెద్దామెకు నోటమాట రాలేదు... కుమార్తె మాత్రం కాస్త లౌక్యం ప్రదర్శించి... వచ్చిన వారిన టీ ఇచ్చి పంపింది. ఆమె ఆలోచన వేరు. రాత్రి... ఆ విషయమే తల్లిని ఓదారుస్తూ చెప్పంది. 'అన్నయ్య ఎలానూ అమెరికా వదలి రాడు. నువ్వు ఒక్కదానివీ ఇక్కడ ఉండడానికి నాకిష్టం లేదు.. ఇంకెందుకూ ఈ ఫ్లాట్‌ను అమ్మేద్దాం. వచ్చిన దానితో... అని చెప్తుండగా సుశీలమ్మ అడ్డుపడింది. అసోసియేషన్ తీర్మానం మాట ఎలా ఉన్నా కుమార్తె ఆంతర్యం అర్థమైంది. ఆమే తనను ఉంచే పరిస్థితి లేదు. ఆమె దాటికి ఇప్పటికే అత్తామామలు అనాథాశ్రమంలో ఉన్నారు. కాదంటే కన్నపేగు కాబట్టి ఎవరితో చెప్పలేదు. ఇప్పుడు కూడా వచ్చే మొత్తంలో ఆమె ఎంతో కొంత ఆశిస్తోంది. ఆ తర్వాత తనూ... అంటే ఆశ్రమం వెతుక్కోవాలి. అందుకే ఆమే నిర్ణయం తీసుకుంది. ఫ్లాట్‌ను బేరానికి పెట్టింది. అనుకున్నంత కాకపోయినా ఇబ్బందిలేకుండా... దానిపై ఎప్పటినుంచో కన్నేసిన ప్రెసిడెంటే కూతురు పేరుమీద కొన్నాడు. వచ్చిన మొత్తంలో సగం కుమార్తె ఇద్దరి పిల్లలకూ తానే పంచేసింది. ఇక నీ సంగతి అని అడక్కుండానే... పరంధామయ్య దశదిన కర్మ పూర్తయిన తర్వాత తన సామాన్లు సర్దుకుంది. అప్పటికే నగరంపై మోజు తీరిన వరాలు ఈ కొలువు నాకొద్దంటూ పల్లెబాట పట్టాడు... సుశీలమ్మ స్వచ్ఛమైన మనుషుల మధ్య చివరి జీవితం గడిపేందుకు స్వగ్రామం వెళ్లిపోయింది... 'ప్రేమ సదన్'తో అనుబంధాన్ని తెంచుకొంది. నగరానికి నమస్కారం పెట్టేసింది. తల్లి నిర్ణయం తనకూ అనుకూలంగా ఉండడంతో కూతురూ అడ్డు చెప్పలేదు. పైగా... అప్పుడప్పుడూ వచ్చి చూస్తాంలే... అంటూ.. అమెరికాలో ఉన్న అన్న మాటల్నే కాస్త తన స్టైల్‌లో చెప్పింది. అన్నిటికీ అనుభవం పండిన సుశీలమ్మ చిరునవ్వుతో సమాధానం చెప్పి.... పల్లె తల్లి ఒడికి వెళ్లిపోయింది...! ప్రేమ లోగిళ్లను వెతుక్కుంది...!

✦

పొటాటో సగ్గుబియ్యం బాల్స్

కావల్సిన పదార్థాలు:

సగ్గుబియ్యం-రెండు కప్పులు, ఉడికించిన బంగాళాదుంపలు-రెండు, అల్లం తరుగు-చెంచా, పల్లీ పొడి-ఒకటిన్నర చెంచా, పచ్చి మిర్చి-ఐదు, జీలకర్ర-చెంచా, కొత్తిమీర-కట్ట, ఉప్పు-తగినంత, నూనె-వేడి చేయడానికి సరిపడా

తయారీ విధానం:

సగ్గుబియ్యాన్ని మూడు గంటల ముందు నానబెట్టుకోవాలి. తరువాత నీటిని పిండేయాలి. ఇందులో నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసుకుంటే పిండిలా అవుతుంది. దీన్ని ఉండల్లా చేసుకోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడి చేసి ఈ ఉండల్ని అందులో వేసి ఎర్రగా వేయించుకుంటే సగ్గుబియ్యం బాల్స్ సిద్ధం.

ఓట్స్ టిక్కీ

కావలసిన పదార్థాలు

ఓట్స్- కప్పు, ఉడికించిన బంగాళా దుంపలు- రెండు, పన్నీర్- పావు కప్పు, కారం-చెంచా, కొత్తిమీర-కట్ట, క్యారెట్ తురుము-కప్పు, మొక్కజొన్న పిండి-రెండు చెంచాలు, ఉప్పు-తగినంత, నూనె-పావు కప్పు, బ్రెడ్ పొడి-అర కప్పు.

తయారీ విధానం

మొక్క జొన్న పిండి, బ్రెడ్ పొడి, నూనె కాకుండా మిగిలిన పదార్థాలన్నీ ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అన్నింటినీ బాగా కలిపి టిక్కీలా చేసుకోవాలి. వీటిని ముందు మొక్క జొన్నపిండిలో తరువాత బ్రెడ్ పొడిలో దొర్లించి పెనంపై ఉంచి కాల్చుకోవాలి. అంతే నోరూరించే టిక్కీలు తయార్.

జామ్ పరోటా

కావలసిన పదార్థాలు

గోధుమపిండి-రెండు కప్పులు, జామ్-కప్పు, ఉప్పు-తగినంత, జీలకర్ర పొడి-అరచెంచా, నూనె-కప్పు, వెన్న- రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ విధానం

ఓ గిన్నెలో గోధుమ పిండి, జీలకర్ర పొడి ,ఉప్పు తీసుకుని కలపాలి. తరువాత నీళ్లు పోసుకుంటూ చపాతీ పిండిలా కలిపి పెట్టుకోవాలి. కొద్దిగా పిండిని తీసుకుని చపాతీలా వత్తుకుని తీసుకోవాలి. అలాగే మరికొంచెం పిండి కూడా తీసుకుని అదే సైజులో చపాతీ చేసుకోవాలి. ఒకదానిపై కొద్దిగా వెన్న, జామ్‌ని పూతలా రాయాలి. దానిపైనా కొద్దిగా వెన్న, జామ్‌ని పూతలా రాయాలి. దానిపైన మరో చపాతీ ఉంచి అంచుల్ని అతికించేయాలి. దీన్ని వేడిపెనంపై ఉంచి నూనె వేసుకుని రెండు వైపులా కాల్చుకోవాలి. ఇలా మిగిలిన పిండిని కూడా చేసుకుంటే సరి.



పనీర్ వెజిటబుల్ దోశ

కావలసిన పదార్థాలు

దోశపిండి-పెద్ద గిన్నె నిండా, పన్నీర్-వంద గ్రాములు, ఉల్లిపాయ ముక్కలు-అరకప్పు, టొమాటోలు- రెండు, క్యాప్సికం-ఒకటి, క్యాబేజీ తరుగు-కప్పు, పచ్చిమిర్చి-ఆరు, సోయా సాస్-నాలుగు చెంచాలు, కారం-టేబుల్ స్పూన్లు, ఉల్లికాడల తరుగు-కప్పు, కొత్తిమీర-కట్ట, చీజ్ ముక్కలు-కొన్ని, ఉప్పు కలపని వెన్న-కప్పు, నూనె-కప్పు, ఉప్పు-తగినంత, టొమాటో సాస్-అర కప్పు.

తయారీ విధానం

ముందుగా పనీర్ టొమాటోలూ, క్యాప్సికం, పచ్చిమిర్చి, కొత్తిమీరను విడివిడిగా సన్నగా తరిగి పెట్టుకోవాలి. పెనం వేడిచేసి దానిపై పిండిని పల్చని దోశలా పరవాలి. మధ్యలో చెంచా వెన్న దానిపై ఉల్లిపాయ , క్యాబేజీ, టొమాటో ముక్కలు చెంచా చొప్పునా కొద్దిగా క్యాప్సికం, పచ్చి మిర్చి ముక్కల్ని వేసేయాలి. ఇప్పుడు కొంచెం సోయా సాస్, కొద్దిగా కారం, గరం మసాలా దోశంతా పడేలా చల్లాలి. ఈ ముక్కలపై కొద్దిగా టొమాటో సాస్, పనీర్ తరగూ, తగినంత ఉప్పు, ఉల్లికాడల తరుగూ కొద్దిగా నూనె వేసుకుని దోశలా కాల్చుకోవాలి. దానిపైన మళ్లీ కొద్దిగా వెన్న, కొత్తిమీర తరుగూ చీజ్ ముక్కలూ వేస్తే సరిపోతుంది. దోశను మధ్యకు మడిచి పళ్లెంలోకి తీసుకుని కొబ్బరి చట్నీతో కలిపి వడ్డించాలి. ఇలా మిగిలిన పిండినీ చేసుకోవాలి.

చుక్కలు కలపండి

జంతువులు ఎన్ని?

ఈ చిత్రంలో వివిధ రకాల జంతువులు ఉన్నాయి. అవి ఎన్నో గుర్తించి, పేర్లను రాయండి.

ఆకులు....పండ్లు

పళ్లన్నీ ఒకేలా వుండవు. అలాగే వాటి ఆకులు కూడా వేర్వేరుగా వుంటాయి. ఇక్కడ కొన్ని పండ్లు ... వాటికి ఎదురుగా కొన్ని ఆకులు ఇచ్చాం. ఏ పండు ఆకు ఏదో గుర్తించండి.

ఏయే జంతువులు ఉన్నాయి

ఈ చిత్రంలో ఓ జీవి వుంది. కాకపోతే అందులో మొత్తం రెండు జంతువుల శరీర భాగాలున్నాయి. వాటిని గుర్తించి చెప్పండి.

తేడా బొమ్మ

ఇక్కడ మూడు రకాలు బొమ్మలు వున్నాయి. అయితే ఇందులో ఒక చిన్న తేడా ఉంది. మరి ఆ తేడా వున్న బొమ్మ ఏదో గుర్తించండి.

దారి కనుక్కోండి

మీకు ఆపిల్ పండు అంటే చాలా ఇష్టం కదా. జంతువులకు కూడా ఆ ఆపిల్ అంటే చాలా ఇష్టమట. అందుకే త్వరత్వరగా ఆపిల్ పండు చేరుకొని తినాలనుకొంటున్నాయి. కాస్త దారి చూపించండి.



ఏ గంటకు ఏ తాడు

స్కూల్లో గంట ఎప్పుడు మోగుతుందా అని ఎదురుచూస్తుంటారు కదా మీరు. ఇక్కడ నాలుగు గంటలు ఉన్నాయి. ఇంతకీ వాటిని మోగించడానికి ఏ తాడును వాడాలో కనుక్కోండి.



భలే టూత్ బ్రష్!

మన రోజు మొదలై, ముగిసేది పళ్లు తోముకోవడంతోనే. టూత్ బ్రష్ లేకుండా శుభ్రం చేసుకోవడం కష్టం కదా. మరి ఈ టూత్ బ్రష్ సంగతులు మీకు తెలుసా.

- ఇప్పుడు మనం వాడుతున్న టూత్ బ్రష్ మోడల్‌ను 1938లో రూపొందించారు.
- అంతకు ముందు వివిధ రకాల బ్రష్‌లుండేవి.
- 5 వేల ఏళ్ల క్రితం నుంచే వేప లాంటి చెట్ల పచ్చి పుల్లలను పళ్ళు తోమేందుకు ఉపయోగించారు.
- బ్రిసిల్స్ ఉన్న బ్రష్‌లను 1498లో తొలిసారిగా చైనాలో తయారుచేశారు.
- వెదురు పుల్లలకు పంది వెంట్రుకలను కట్టి చేసినవే అవి.
- వాటినే 1938లో నైలాన్ బ్రిసిల్స్ వచ్చే వరకు వాడారు.
- డుపాంట్ డి నెమోర్స్ రూపొందించిన ఈ తొలి నైలాన్ బ్రిసిల్సున్న బ్రష్‌లకు డాక్టర్ వెస్ట్స్ మిరకల్ బ్రష్‌గా పేరు.
- 1780లోనే విలియం యాడ్డీస్ అనే ఇంగ్లండ్ ఖైదీ కొత్త డిజైన్‌ను తయారు చేశాడట.
- రెండో ప్రపంచ యుద్ధం తర్వాతే టూత్‌బ్రష్‌ల వాడకం పెరిగిందట.
- దంతధావనంపై అంత శ్రద్ధ లేని అమెరికన్లకు యుద్ధ సైనికుల ద్వారానే దాని ప్రాముఖ్యత తెలిసి వచ్చిందట.
- 1956లోనే ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్ వచ్చేసింది.
- 1850 ముందు వరకు పళ్లపొడి మాత్రమే ఉండేది. తర్వాతే పేస్టు వచ్చింది.
- ఆ పేస్టును మొదట్లో కుండల్లో ఉంచేవారు, ట్యూబుల రూపంలో 1890 నుంచి వచ్చాయి.
- 1945 వరకు సబ్బును పేస్టులో కలిపేవారు. సోడియం లారైల్ సల్ఫేట్ తయారు చేశాక దాన్నే వాడటం ప్రారంభించారు.
- ఏటా కొన్ని లక్షల టన్నుల టూత్‌బ్రష్‌లను ప్రపంచ వ్యాప్తంగా వాడి పారేస్తుండటంతో రీసైకిల్డ్ ప్లాస్టిక్‌ను తయారీలో వాడుతున్నారు.
- 1963 నుంచి 1998 మధ్య ఒక్క అమెరికాలోనే 3000 రకాల టూత్ బ్రష్‌ల డిజైన్లకు పేటెంటులు పొందారు.
- ఓ సాధారణ టూత్‌బ్రష్‌లో 2500 బ్రిసిల్స్ 40 గుత్తులుగా ఉంటాయి.
- మనం 5 రకాలుగా బ్రష్‌లను పట్టుకుని పళ్లు తోముకుంటామని పరిశోధనలో తేలింది.
- పళ్ల వరుస, చిగుళ్లను బట్టి కూడా బ్రష్‌లు అందుబాటులోకి వచ్చాయి.
- రోజు నిద్ర తర్వాత, ముందు పళ్లను తోముకోవడం ఉత్తమం. కనీసం రెండు నిమిషాల పాటు పళ్లు తోముకోవాలి.
- జ్వరం లేదా జబ్బుపడిన తర్వాత బ్రష్‌ను మార్చేయడం మంచిది. నోటి క్రిములు బ్రష్‌లో పేరుకుపోయి మళ్లీ వ్యాధిన పడేసే అవకాశం ఉంది. ✦

భారత విద్యా వ్యవస్థపై సోదాహరణ విశ్లేషణ

సమాజ అభివృద్ధిలో విద్య ముఖ్య భూమికను పోషిస్తుంది. భారతీయ సమాజంలో వచ్చిన మార్పుల ప్రభావం విద్యారంగం మీద ఎలా పడిందనే విశ్లేషణే 'భారత దేశ విద్యా చరిత్ర' (ప్రాచీన కాలం నుంచి నేటి వరకు). ఈస్టిండియా కంపెనీ భారతదేశానికి రాక ముందు భారత దేశ విద్యారంగ పరిస్థితుల మీద చేసిన విశ్లేషణ ఆసక్తికరంగా ఉంది. గణిత శాస్త్ర అభివృద్ధిలో భాగంగా ప్రపంచానికి "సున్నా"ని పరిచయం చేయడం, జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు బోధించే పద్ధతి, బౌద్ధ, ఇస్లాం పాఠశాలల్లో రెండంచెల విద్యావిధానం వంటి మంచి అంశాలు ఉన్నప్పటికీ సమాజంలో బహు కొద్ది మందికి మాత్రమే విద్య అందుబాటులో ఉండేది. ఈస్టిండియా కంపెనీ పాలన మొదలయ్యాక విద్యారంగంలో నూతన శకం ప్రారంభమైంది. స్వాతంత్ర్యానికి ముందు భారత దేశంలో విద్యా వ్యాప్తిని మొదటి భాగంలోనూ, స్వాతంత్ర్యం తరువాత 21వ శతాబ్దపు విద్యా పరిస్థితులను రెండవ భాగంలోనూ రచయిత ఈ పుస్తకంలో విశ్లేషించారు. ఈస్టిండియా కంపెనీ పరిపాలన కాలంలో ఇంగ్లీషు చదువులకు పునాది పడింది. క్రైస్తవ మిషనరీలు, కంపెనీ నడిపిన సెక్యులర్ పాఠశాలలు ఒక వైపున ,భారతీయ సంస్కృతిలో భాగమైన వీధి బడులు మరొకవైపు విద్యావ్యాప్తికి కృషి చేశాయి. గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఫలితంగా యూనివర్సిటీ విద్య ప్రారంభం జరిగింది. ఈ కాలంలోనే చదువుకున్న భారతీయ నూతనతరం చేసిన ప్రతిపాదనలను విద్యా వ్యాప్తికి వారు చేసిన కృషిని రచయిత చాలా చక్కగా విశ్లేషించారు. ఈస్టిండియా కంపెనీ నుంచి బ్రిటిషు ప్రభుత్వానికి పాలనా మార్పిడి జరిగిన తరువాత భారతదేశాన్ని ఒక మార్కెట్‌గా మార్చివేయడానికి విద్యారంగాన్ని ఎలా ఉపయోగించిన "విభజించు పాలించు" అనే దమన నీతిని విద్యారంగంలో చొప్పించిన విధానాన్నీ రచయిత చక్కగా వివరించారు. ఈ కాలంలో ఒక పక్కన ప్రాథమిక విద్య ప్రయివేటు రంగంలో వ్యాప్తి చెందడానికి అవకాశం కల్పిస్తూనే మరొక పక్కన ఎంపిక చేయబడిన కొంతమందికి మాత్రమే యూనివర్సిటీ విద్యను అందించిన ఫలితంగా దేశంలో సెకండరీ విద్యా విధానం ఎలా వెనుకబడిందీ గణాంకాలతో వివరించారు. ఇంగ్లీషు చదువుకున్న విద్యాధికులు భారత స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన క్రమం, బ్రిటిషు విద్యావిధానం మీద వారు చేసిన విమర్శలు ప్రజల రాజకీయ చైతన్య స్థాయిని పెంచడానికి విద్యారంగం ఎలా కేంద్రమయిందనే విశ్లేషణ ఈ భాగంలో మనం చూడవచ్చు.

స్వాతంత్ర్యం తరువాత భారతదేశంలో జరిగిన విద్యావ్యాప్తిని నూతన విద్యావిధానానికి ముందు, తరువాత–అనే రెండు భాగాలుగా రచయిత విశ్లేషించారు. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే జాతీయోద్యమ కాలంలో రేకెత్తిన ఆకాంక్షలకు అనుగుణంగా రాధాకృష్ణన్ కమిషన్, మొదలియార్ కమిషన్ చేసిన సూచనలను చక్కగా వివరించారు. ప్రభుత్వం పక్కన పెట్టిన ముఖ్యమైన అంశాలు యుజిసికి స్వయం ప్రతిపత్తి కల్పించకపోవడం, పారిశ్రామిక సెస్‌ని వేయకపోవడం లాంటి చర్యలు భారతీయ సమాజం మీద ఎలాంటి ప్రభావాన్ని చూపించిందీ రచయిత చక్కగా విశ్లేషించారు. కొఠారీ కమిషన్ సిఫార్సులతో పాటు ప్రభుత్వరంగం ప్రభావం విద్యావ్యాప్తి మీద ఎలా పడిందనే వివరణ బాగుంది.

ప్రైవేటు రంగం– బహుళజాతీ సంస్థల మధ్య అనుబంధం నూతన విద్యావిధానానికి ఎలా నాంది పలికింది. అనే విశ్లేషణ ఈ పుస్తకంలోని ప్రత్యేకత. నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తరువాత భారతీయ సమాజంలో వచ్చిన పెను మార్పులకు సంబంధించిన వివరణ తప్పక చదవవలసిందే. భారతదేశ ప్రత్యేకతలు అర్థం చేసుకుని సరైన విద్యావిధ్యానాన్ని రూపొందించడానికి అవసరమైన చారిత్రక నేపథ్యం విశ్లేషణ ఈ పుస్తకంలో పుష్కలంగా కనబడుతుంది. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, విద్యారంగ చరిత్రను తెలుసుకోగోరే వారికి... ఒక్క మాటలో చెప్పాలంటే... విద్యారంగం మీద ఆసక్తి వున్న వారందరికీ ఈ పుస్తకం చాలా ఉపయోగకరంగా వుంటుంది.

-ప్రొ॥ ప్రతాప్ రెడ్డి



భారత దేశ విద్యా చరిత్ర (ప్రాచీన కాలం నుంచి నేటి వరకు), కె. కేశవరెడ్డి, పేజీలు: 317/-, వెల: 200/-, ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్, 27-1-54, కారల్ మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ. ఫోన్- 27660013.



"స్త్రీ పర్వం" నవల, రచన: సింహప్రసాద్, పేజీలు: 146/-, వెల: 120/-, ప్రతులకు: శ్రీశ్రీ ప్రచురణలు, 401 మయూరి ఎస్టేట్స్- ఎమ్.ఐ.జి, కెపిహెచ్‌బి కాలనీ, హైదరాబాద్.

స్త్రీ పర్వం

"స్వాతి" పత్రిక అవార్డ్ పొందిన నవల ఇది. సింహప్రసాద్ పేరుతో రచనలు చేసే వీరి పూర్తి పేరు చెలంకూరి వరహ నరసింహ ప్రసాద్. దాదాపు 277 కథలూ, 54 నవలలు వీరివి ప్రచురణాలైనాయి. మహిమాన్విత స్త్రీ సూక్తం అంటూ డా॥కె.బి. లక్ష్మి ముందుమాట రాశారు. విశాలాక్షి సుబ్బన్నల కుమార్తె ఉత్పలమాల కళాకారిణి. చిత్రకారిణి. ఆమెను ఇష్టపడి పెళ్ళి చేసుకుంటాడు వనమాలి. అప్పుడప్పుడు కవితలు రాస్తాడు. అందరు భర్తల్లానే వనమాల ప్రవర్తిస్తాడు. కొద్ది కాలానికి తాగుడు, పరస్త్రీ వ్యామోహంలో పడి హత్యకు గురౌతాడు. అప్పటికే ఉత్పలమాల గర్భిణి. ఆమె మన్వితకు జన్మనిస్తుంది. దురదృష్టం వెంటాడినట్లు ఆమెకు బ్రెస్ట్ క్యాన్సర్ రావడంతో ఆమె రాసిన డైరీలు ఆమె కూమార్తె మన్విత ప్రియుడు జయంత్ చదవడం మన్విత "ఉత్పలమాల ఛారిటబుల్ ట్రస్ట్ ఫర్ బ్రెస్ట్ క్యాన్సర్ విక్టిమ్స్" స్థాపించి సేవ చేయడం, ఆ క్యాన్సర్ ఆసుపత్రిలో జయంత్ తల్లి చేరిన సంగతి తండ్రి భూషణం ద్వారా జయంత్ తెలుసుకోవడం, బాధతో హాస్పిటల్ చేరడం, మన్వితను పెళ్ళాడాలనే కృత నిశ్చయం చేసుకొని తల్లికి చెప్పడంతో నవల ముగుస్తుంది. నవల మధ్యలో జయంత్‌ను పెళ్ళాడాలనే ధనిక యువత యశస్విని రాక ఆమె ఆధునిక భావావేశాలు... ఎసిబి దాడుల్లో యశస్విని తండ్రి పట్టుబడటం, ఉత్పల పెద్దనాన్న రాధాకృష్ణమూర్తి పాత్రలు నవలలో సీరియస్‌నెస్‌ను పెంచాయి. జయంత్, మన్వితల ప్రేమతో నవల ఆరంభమై పెళ్ళి చేసుకోదలచే ప్రపోజల్ తో ముగుస్తుంది. ప్రేమ, సమాజసేవ , క్యాన్సర్‌పై యుద్ధం, మిడిల్ క్లాస్ ఆలోచనలు నవల ప్రధానాంశాలు. ఉత్పలమాల... మన్విత రెండు తరాలకు చెందిన కథానాయికలుగా నవలలో కనిపిస్తారు. అలాగే పురుష మనస్తత్వాన్ని జయంత్ ...వనమాలి పాత్రల్లో చక్కగా తేట తెల్లం చేసారు రచయిత. డా॥ కె.బి లక్ష్మిగారు ముందు మాటలో అన్నట్లుగా ఒక మెడికల్ డాక్యుమెంటరీ తీయాల్సిన సబ్జెక్టు తీసుకుని నవరస భరిత నవలగా తీర్చిదిద్దారు రచయిత.

-తంగిరాల చక్రవర్తి

అచ్చంగా బార్బీ బొమ్మే

బార్బీ బొమ్మ ప్రాణం పోసుకుని నడిచి వస్తే ఎలా ఉంటుందో రష్యాకు చెందిన టాటియానా టుజోవా అలా కనిపిస్తుంది. పింక్ లవర్‌గా, రియల్ డాల్‌గా పేరు తెచ్చుకున్న ఈ అమ్మడికి 28 ఏళ్లు వచ్చినా బార్బీ బొమ్మ పిచ్చిని వదిలించుకోనంటోంది. సోషల్ మీడియాతో పాటు టీవీ కార్యక్రమాల్లో సెలబ్రెటీగా వెలిగిపోతున్న ఈ చిన్నది 50 ఏళ్లు నిండినా బార్బీ బొమ్మలాగే ముస్తాబవుతానంటోంది. ఈ బార్బీ ముద్దు గుమ్మ అందానికి చిత్తై పెళ్లి చేసుకున్నవారు టాటియానా పింక్ పిచ్చి భరించలేక విడాకులు ఇచ్చేశారు. మూడు పెళ్ళిళ్లు, చాలా లవ్ స్టోరీలు నడిచినా అందరూ బార్బీకి దూరంకమ్మని అడగడంతో ఒంటరిగానైనా మిగిలిపోతాను గానీ, తన ఇష్టాన్ని మాత్రం విడవనంటోంది. 12 ఏళ్లపుడు టాటియానాకు బార్బీ బొమ్మను బహుమతిగా ఇచ్చారు తల్లిదండ్రులు. ఆ బొమ్మతో ప్రేమలో పడిన టాటియానాకు అదే లోకం అయిపోయింది. ఆ బొమ్మ ఆహార్యాన్ని అనుకరిస్తూ పొట్టి ఫ్రాక్‌లు, పింక్ చెప్పులు, లాంగ్‌కర్లీ బ్లాండ్ జుత్తుతో నిజం బార్బీగా తయారైంది. సన్నగా, అందంగా ఉండే టాటియానా చిన్ననాటి నుంచి ప్రిన్సెస్‌లా చూసేవారట. ఏ కార్యక్రమంలోనైనా ఆ గెటప్ వేసి షోలో పాల్గొనేది. అదే బాగా తలకెక్కి బార్బీ ప్రిన్సెస్‌లా శాశ్వతంగా ఉండిపోతానని తేల్చిచెప్పింది. ఆమె గదిని పింక్‌తో నింపేసింది. డ్రస్సులు, వార్డ్‌రోబ్, ఫర్నీచర్ ఇతర సామానంతా గులాబి మయమే. చివరకు ఆమె వాడే కారు కూడా పింక్ రంగులో ఉండి దానికి బార్బీ స్టిక్కర్లుంటాయి. ఆఖరిగా టాటియానాకు వున్న వింత అలవాటు గురించి ప్రస్తావించుకుందాం. ఈమె ఒకసారి వేసిన దుస్తులను మళ్లీ వాడదు. ●



భారతదేశ స్కూల్స్ చరిత్రలో సంచలనం
2011, 2012, 2013, 2014, 2015 వరుస విజయాల విశ్వభారతి ప్రభంజనం
పొట్లూరి శ్రీమన్నారాయణ
ఛైర్మన్
2011 1 All India
I. Prudhvi Tej
IIT - JEE 2011
2012 1 State
Ch. Nitish Chandra
EAMCET - 2012
2013 1 All India
P. Sai Sandeep Reddy
IIT - JEE 2013 & EAMCET - 2013
48 years of Academic Excellence
2015
2 State
D. AKSHITH REDDY
EAMCET - 2015
3 State
V. ANOOHYA
EAMCET (MEDICAL) - 2015
4 State
G. JAYA HARISH
EAMCET (MEDICAL) - 2015
IIT - JEE 2015లో
ఒకే ఒక్క బ్రాంచి నుండి
1000లోపు 18 ర్యాంకులతో
తిరుగులేని
"విశ్వభారతి"
2011 8 All India
T. Bhargav Reddy
IIT - JEE 2011
2012 4 All India
P. Balaji Vishal
IIT - JEE 2012
5 All India
D. Venkatesh
IIT - JEE 2012
2014 2 All India
R. Abhinav
IIT - JEE 2014
4 All India
R. Lohith
IIT - JEE 2014
విశ్వభారతి
ఇంగ్లీషు మీడియం హైస్కూల్
గుడివాడ - 521 301, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్
e-mail : viswabharati@yahoo.com ; Website : viswabharati.org
08674 - 249292
246969
Cell : 9848134850